ప్రజాశక్తి

శుక్రవారం 20 జనవరి 2023

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

ప్రజలపై విద్యుత్ భారాలా..

- ప్రభుత్వం మొండిగా ముందుకెళ్తే ఉధృత ఉద్యమం
- ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం వద్ద సిపిఎం, సిపిఐ నిరసన
- భారాలు వేసే విధంగా ఇఆర్‌సి వ్యవహరించరాదన్న నేతలు

నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం

ప్రజాశక్తి - సీతమ్మధార : రాష్ట్రంలోని కోటీ 89 లక్షల మంది వినియోగదారులకు, నివాస గృహాలు, కార్యాలయాలు, వ్యాపార సంస్థలకు.. ఇలా అన్నింటికీ 2025 మార్చిలోగా ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు పెట్టాలనే ప్రతిపాదన వినియోగదారులపై తీవ్రమైన భారాన్ని మోపుతుందని, అదానీ లాంటి కార్పొరేట్ సంస్థల లాభాల కోసం చేపట్టిన విద్యుత్ సంస్కరణల అమలును తక్షణమే నిలిపివేయాలని సిపిఎం, సిపిఐ ఎపిఇఆర్‌సిని కోరాయి. ప్రజలపై భారాలు వేస్తే మరో విద్యుత్ ఉద్యమం చేపడతామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు హెచ్చరించారు. ఈ నెల 19, 20, 21 తేదీల్లో ఎపిఇఆర్‌సి చేపడుతున్న ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలపై భారాలు వేసే విధంగా నిర్ణయాలు ఉండటాన్ని వ్యతిరేకిస్తూ ఆ రెండు పార్టీలూ గురువారం గురుద్వార్ వద్ద ఉన్న ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం వద్ద పెద్దఎత్తున నిరసన తెలియజేశాయి. ఈ సందర్భంగా లోకనాథం, పైడిరాజు మాట్లాడుతూ ఈ బడ్జెట్‌లో రూ.13 వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేస్తున్నారని, ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల పేరిట వినియోగదారులపై మరో రూ.1,32,502 కోట్లు భారం మోపుతున్నారని తెలిపారు. గతంలో హిందూజాకు రూ.1200 కోట్లను కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం చేస్తే ఇఆర్‌సి దీనిని వ్యతిరేకించిందని గుర్తుచేస్తూ ఇప్పుడు కూడా ఇఆర్‌సి వెనుక్కు తగ్గకుండా అదే నిర్ణయంపై ఉండాలని కోరారు. గ్రీన్ ఎనర్జీ పేరుతో 75 వేల ఎకరాల భూమిని హైడ్రోజల్ కంపెనీకి కారుచౌకగా కట్టబెట్టడాన్ని మిగతా 2లో..

నేతలను రోప్‌తో చుట్టుముట్టిన పోలీసులు

అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

రోడ్డు భద్రతా పార్కుల ఏర్పాటుకు కృషి

విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జిల్లాలో రోడ్డు ప్రమాద మరణాలు సంభవించకుండా అవసరమైన రవాణా భద్రతా చర్యలు చేపట్టాలని, భద్రతా పార్కుల ఏర్పాటుకు కృషి చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం ఉదయం రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భద్రతపై రవాణా, పోలీస్, జాతీయ రహదారి, ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల ప్రమాదాల శాతం తగ్గుముఖం పట్టినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకొనే చర్యలు ప్రయోజనం కలిగించే విధంగా ఉండాలన్నారు. జాతీయ, జిల్లా రహదారులు పక్కన ఉన్న రోడ్లను రెవెన్యూ రికార్డుల సహాయంతో గుర్తించి ఆక్రమణలను వెంటనే తొలగించాలని, జాయింట్ ఇన్‌స్పెక్షన్‌లో గుర్తించిన లోపాలకు సంబంధించిన పనులను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా రహదారి భద్రతా కమిటీ సమావేశంలో గుర్తించిన రూ.28 కోట్ల పనులకుగాను మల్టీలెవెల్ పార్కింగ్ కోసం రూ.11.4 కోట్లు, రోడ్ల మరమ్మతులకు రూ.8 కోట్లు, కూడళ్ల అభివృద్ధికిగాను రూ.5.7 కోట్లు, స్పీడ్ బ్రేకర్లు, రోడ్ మార్కింగ్ మిగతా 2లో..

కుటుంబంలో ముగ్గురు అనుమానాస్పద మృతి

వార్త మెయిన్‌లో..

ఎల్ఐసిని ప్రయివేటీకరించొద్దు

వార్తలు 5, 8 పేజీల్లో..

ఘనంగా వేమన జయంతి

వార్త 2లో..

28న శారదా పీఠానికి సిఎం జగన్

ఏర్పాట్లును పరిశీలించిన జివిఎంసి కమిషనర్

ఏర్పాట్లును పరిశీలిస్తున్న రాజాబాబు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 28న జిల్లాలోని శ్రీ శారదా పీఠాన్ని సందర్శించనున్నారు. పీఠం వార్షిక మహోత్సవాల్లో భాగంగా నిర్వహించే రాజ శ్యామల యాగంలో ఆయన పాల్గొంటారు. అదే రోజు తమిళనాడు గవర్నరు రవి నారాయణ, పంజాబ్ గవర్నరు బన్వర్‌లాల్ పురోహిత్ కూడా విశాఖ శారదా పీఠాన్ని సందర్శించనున్నారు. 27 నుంచి 31వ తేదీ వరకు సాగే పీఠం వార్షికోత్సవాల్లో మరికొందరు విఐపిలు కూడా పాల్గొంటున్న నేపథ్యంలో జివిఎంసి కమిషనర్ రాజాబాబు గురువారం విశాఖ శ్రీ శారదా పీఠాన్ని సందర్శించారు. విఐపిల తాకిడి నేపథ్యంంలో చేపట్టాల్సిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. పీఠం పరిసరాలను పరిశీలించి కార్పొరేషన్ చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై చర్చించారు. అనంతరం పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర స్వాములను కలిసి ఆశీస్సులు అందుకున్నారు. జివిఎంసి ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో పాటు పలు విభాగాల అధికారులు కమిషనర్ వెంట ఉన్నారు.

పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ - విశాఖపట్నం సెక్షన్‌లో రేగుపాలెం - నర్సీపట్నం స్టేషన్ల మధ్య ట్రాఫిక్ బ్లాక్‌ల కారణంగా పలు రైళ్లు పూర్తిగా, పాక్షికంగా రద్దయినట్టు రైల్వే శాఖ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. 17267 కాకినాడ- విశాఖపట్నం మెము ఎక్స్‌ప్రెస్, 17268 - విశాఖపట్నం- కాకినాడ మెము ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ నెల 21, 22 తేదీలల్లో పూర్తిగా రద్దు చేశారు. 17239 గుంటూరు- విశాఖపట్నం సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను 21, 22 తేదీల్లో సామర్లకోట వరకు కుదించారు. కావున 17240 విశాఖపట్నం-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ 22, 23 తేదీల్లో విశాఖ నుంచి కాకుండా సామర్లకోట నుంచి బయలుదేరి వెళ్తుంది. కావున 21, 22, 23 తేదీల్లో సామర్లకోట, విశాఖపట్నం మధ్య ఈ రైలు సర్వీసులు ఉండవు. 12718 విజయవాడ-విశాఖపట్నం రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌ను 21, 22 తేదీల్లో తుని వరకు కుదించారు. కావున 12717 విశాఖపట్నం- విజయవాడ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ 21, 22 తేదీల్లో విశాఖపట్నంకు మిగతా 2లో..

దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న నాయకులు

ఉక్కు ప్రజా గర్జనను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు నగరంలో ఈ నెల 30న జరిగే ప్రజా గర్జనను జయప్రదం చేయాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు పడాల రమణ, జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి ఎం.మన్మథరావు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు గురువారం నాటికి 658వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఎఐటియుసి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను నూరు శాతం ప్రైవేటీకరిస్తామని ప్రకటన చేసిన దగ్గర నుండి కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద 707 రోజులుగా మిగతా 2లో..

ఘనంగా వేమన జయంతి

ప్రజాశక్తి -యంత్రాంగం

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పలుచోట్ల గురువారం యోగి వేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. వేమన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. పలుచోట్ల పద్యాల పోటీలు నిర్వహించారు.

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వేమన రాసిన పద్యాలు యువతకు ఎంతో స్ఫూర్తినిస్తాయని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో యోగి వేమన జయంతి సందర్భంగా వేమన చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆనాడే సమాజ కట్టుబాట్లు, మనిషి ప్రవర్తనలోని లోటుపాట్లను పద్యాల ద్వారా ప్రశ్నించిన గొప్ప కవి వేమన అని తెలిపారు. ఆయన శైలి ఎవరికీ రాలేదని, ఆ తర్వాత కూడా ఎవరూ వేమనలా సరళమైన భాషలో పద్యాలు రాయలేకపోయారని తెలిపారు. మానవ జీవితం, మనుషులు చేసే తప్పులు, కులాలు, మతాలు, సంఘంలోని కట్టుబాట్లు, నకిలీ సన్యాసులు.. ఇలా అందరినీ, అన్ని సమస్యలనూ తన పద్యాల ద్వారా ప్రశ్నించిన గొప్ప మేధావి, సంఘ సంస్కర్త యోగి వేమని అని ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, ఉప రవాణా కమిషనర్ జిసి.రాజారత్నం పాల్గొన్నారు.

తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు పరిధి బంగ్లా మెట్ట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు యోగి వేమన పద్యాలపై పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రెడ్డిపల్లి అప్పలరాజు, ఎస్‌ఎంసి చైర్‌పర్సన్ మానసాదేవి, ఉపాధ్యాయులు రమేష్, మల్లిక, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : విశాఖ పౌర గ్రంథాలయంలో వేమన చర్చా వేదిక నిర్వహించారు. డాక్టర్ డివి.సూర్యారావు, గ్రంథాలయ కార్యదర్శి డిఎస్.వర్మ నేతృత్వంలో ఆచార్య తిమ్మారెడ్డి, ఆచార్య వి.సిమ్మన్న, డాక్టర్ డి.పద్మజ, డాక్టర్ ఎం.సుబ్బారావు, ఎస్.ప్రభాకరరావు, పరవస్తు సూరి, బి.వెంకటరావు, గుండాన జోగారావు తదితరులు వేమన తత్వాన్ని ఆవిష్కరించారు

పద్మనాభం : మండలంలోని కృష్ణాపురం కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో ప్రత్యేకాధికారి గ్రేష్ లిల్లి ఆధ్వర్యాన వేమన జయంతిని నిర్వహించారు. జిసిడిం ఎంఎం బాలికా అభివృద్ధి అధికారి డాక్టర్ కాలేషా బేగం, గణిత శాస్త్ర నిపుణులు సతీష్, ఎ.రాజశేఖర్ ప్రసంగించారు.

అనకాపల్లి : యోగి వేమన తన రచనలతో సంఘంలో చైతన్యం, సంస్కరణలు తీసుకొచ్చారని అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవిసుభాష్ పట్టన్‌శెట్టి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో వేమన జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమాజంలో పేరుకుపోయిన ఛాందస భావాలను రూపుమాపడానికి వేమన ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణ, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఎ.శ్రీనివాసరావు, పర్యవేక్షకులు శ్రీనివాసరావు, చంద్రశేఖర్, ప్రసాదరావు సిబ్బంది పాల్గొన్నారు.

వేమన చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

వైసిపి ప్రాంతీయ సమన్వయకర్త వైవి.సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ

వైసిపి ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని టిటిడి చైర్మన్, వైసిపి ప్రాంతీయ సమన్వయకర్త వైవి.సుబ్బారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మద్దిలపాలెంలోని వైసిపి కార్యాలయంలో గురువారం జరిగిన పార్టీ దక్షిణ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటమి భయంతో తెలుగుదేశం సాగిస్తున్న దొంగ ఓట్ల నమోదు కార్యక్రమం పట్ల కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, బూత్ స్థాయిలో టిడిపి నమోదు చేయిస్తున్న దొంగ ఓట్లను అడ్డుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డిపై చంద్రబాబు, పవన్ కల్యాణ్, పచ్చ మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మితే రాష్ట్రంలోని కోట్లాది మంది పేద ప్రజానీకం పథకాలకు దూరమైపోతారని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన పథకాలు, అభివృద్ధి గురించి ఇంటింటికి వెళ్లి తెలియజెప్పాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో విశాఖ దక్షిణ ఎమ్మెల్యేగా వాసుపల్లి గణేష్ కుమార్‌ను గెలిపించాలన్నారు. పార్టీలో అంతర్గత సమస్యలుంటే నాలుగు గోడల మధ్య చర్చిద్దామని, దాని కోసం తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ సమావేశంలో ఆయన్ను పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు మాజీ శాసన సభ్యులు తైనాల విజయ్ కుమార్, రెహమాన్, మత్స్య కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణపై వినతి

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : త్వరలో జరుగనున్న పార్లమెంట్ సమావేశాలలో ఎస్‌సిలను ఎబిసిడిలుగా వర్గీకరణ చేసే బిల్లుకు బిజెపి మద్దతు ఇవ్వాలని, ఆ దిశగా పార్టీ అగ్ర నాయకత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు నాయకత్వంలో ప్రతినిధి బృందం గురువారం జ్యోతి థియేటర్ సమీపంలోని కిన్నెర కంఫర్ట్ హోటల్‌లో రాజ్యసభ సభ్యుడు జివిఎల్.నరసింహారావుకు వినతిపత్రం అందజేసింది. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ ఉత్తరాంధ్ర ముఖ్య సలహాదారు కోట్ర కన్నారావు, విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి మోర్తా రమణ, అనకాపల్లి జిల్లా ఇన్‌ఛార్జి ఎలుసూరి గాటీలు, ఎంఇఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్షులు అత్తోటి రవికుమార్, నర్సీపట్నం నియోజవర్గం ఇన్‌ఛార్జి చింతాడ నూకేష్. కస్తూరి వెంకటరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుందాం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవడం, ఎల్‌ఐసిని బలోపేతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతని ఎల్‌ఐసి ఎంప్లాయిస్ యూనియన్ విశాఖ డివిజన్ అధ్యక్షులు ఎం.కామేశ్వరి, ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాదరావు అన్నారు. ఎల్‌ఐసి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం ఎల్‌ఐసి కార్యాలయం వద్ద ఉద్యోగులు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1956లో రూ.5 కోట్ల మూలధనంతో ప్రారంభమైన ఎల్‌ఐసి నేడు రూ.42 లక్షలా 30 వేలా 617 కోట్ల ఆస్తులు కలిగి ఉందన్నారు. సంస్థ ప్రగతిని తెలియజేశారు. అనేక దేశాల జిడిపిలకు మించి ఎల్‌ఐసి ఆస్తులు ఉన్నాయన్నారు. 30 కోట్లకుపైగా పాలసీదారులు ఉన్నట్టు తెలిపారు. ఇప్పటికే ఎల్‌ఐసిలో కేంద్ర ప్రభుత్వం 3.5 శాతం వాటాను ఉపసంహరించుకుందని, ఇది ఎల్‌ఐసి మౌలిక లక్ష్యాలకు విఘాతమని తెలిపారు. కేంద్రం పాలసీదారుల ప్రయోజనాన్ని దెబ్బతీస్తోందన్నారు. ఈ నేపథ్యంలో సంస్థను కాపాడుకునేందుకు ఐక్యంగా పోరాటం సాగించాల్సి ఉందన్నారు.

సిఎస్‌ఆర్ నిధులు సమకూర్చాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వన్ టౌన్‌లో ఉన్న ప్రభుత్వ విక్టోరియా ఘోసాసుపత్రికి ఎల్‌ఐసి ఈ సంవత్సరం నుంచి సిఎస్‌ఆర్ నిధులు అందించి ఆసుపత్రి అభివృద్ధికి సహకరించాలని జెడి ఫౌండేషన్ కన్వీనర్ ప్రియాంక దండి కోరారు. గురువారం ఆమె ఎల్‌ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ జి.సుధాకర్ బాబును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఆసుపత్రికి ఎనాలిజర్స్, లిఫ్ట్, వాటర్ ఫిల్టర్లు అవసరమన్నారు.

మహారాజశ్రీ ఒకటవ అదనపు జిల్లా జడ్జి మరియు మోటారు ఏక్సిడెంట్స్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్, విజయనగరం
ఎం.వి.ఓ.పి 44/2020

మానాపురం హరీష్ ....పిటిషనరు
ఎదరి
కంబర రమణ వగైరాలు .....రెస్పాండెంట్లు

నోటీసు

ఆర్.1:- కంబర రమణ, తండ్రి అప్పన్న, AP 31 TE 9413 ఏచర్ వ్యాన్ డ్రైవర్, కొమ్మాది జంక్షను, మధురవాడ, విశాఖపట్నం జిల్లా.

ఆర్.2 :- M/s శ్రీ గాయత్రి ఎంటర్ ప్రైజెస్ రిప్రజెంటెడ్ బై వడ్డే విజయభాస్కర రెడ్డి, AP 31 TE 9413 ఏచర్ వ్యాన్ ఓనర్, R/o సర్వే నెం. 230/4 & 230/6, వెల్లంకి గ్రామం, ఆనందపురం మండలం, విశాఖపట్నం జిల్లా.

ఇందలి పిటిషనరుకు మీ వాహనం వలన రోడ్డు ప్రమాదం జరగడం వలన నష్టపరిహారం కోసం పై నెంబరు కేసును దాఖలు చేసికొనియున్నారు. మీ యొక్క హాజరు నిమిత్తం తే 31-1-2023దికి వాయిదా అయి ఉన్నది. కావున మీరు స్వయంగా గాని, మీ తరుపు లాయరు ద్వారాగాని సరియైన వాదన తెలుపుకొనుటకు **తే 31-1-2023దీన ఉదయం 10-30గంటలకు** హాజరు కావలెను. లేనిచో ఉన్న రికార్డుల ప్రకారం మీపై పరోక్షంగా తీర్పు పరిష్కారం జరుగునని తెలియపరచడమైనది.

"బై కోర్టు ఆర్డర్"

కె.బి.పరమేశ్వరరావు
పిటిషనరు తరుపున న్యాయవాది,
విజయనగరం,
సెల్ : 9440738336

మహారాజశ్రీ 2వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో, అమలాపురం
O.S. No.19/2022

Between:
సుంకర వరలక్ష్మి -వాది
మరియు
రంబాల పద్మావతి వగైరాలు -ప్రతివాదులు

D-2: రంబాల భాస్కర కిరణ్, 26 సం॥లు, S/o. late నారాయణమూర్తి, D.No. 4-11/A, సిహెచ్.గున్నేపల్లి, ముమ్మిడివరం మండలం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.

D-3: పలక అలేఖ్య నాగదేవి, 31 సం॥లు, W/o. శ్రీనివాస్, డో.నెం. 10-253/10, విశాలాక్షి నగర్, విశాఖపట్నం.

పై నెంబరు దావా పైన తెల్పిన వారి కోర్టులో వాది గారు మీపై తనఖా బాకీ వసూలు నిమిత్తం దావా వేయగా, మీలో 2, 3 ప్రతివాదులైన మీరు దావా సమన్లు తీసుకోకుండా తప్పించుకుంటున్నందున మీకు యీ పబ్లికేషను ద్వారా కోర్టు వాయిదా ది 27-1-2023వ తేదీ తెల్పుతూ సదరు **తేదీ 27-1-2023 ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గానీ, మీ ప్లీడరు గారి ద్వారా గాని పైన తెల్పిన కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెల్పుకోవలెను. లేనిచో పరోక్షమున తీర్మానించబడును.

నల్లా రవిప్రసాద్, అడ్వకేటు
అమలాపురం అమలాపురం
ది.12-1-2023 సెల్: 9866478976

మొదటి పేజీ తరువాయి..

ప్రజలపై విద్యుత్ భారాలా..

ఇఆర్‌సి రద్దు చేయాలని కోరారు. గృహ వినియోగదారులకు స్లాబ్ సున్నా నుంచి 25 యూనిట్లు వరకూ ఉచితంగా ఇస్తున్న దాన్ని వంద యూనిట్లకు పెంచాలని, ఎస్‌సి, ఎస్‌టి సామాజిక తరగతి కుటుంబాలకు 200 యూనిట్లు వరకు ఉచితంగా ఇస్తున్న కరెంటును 300 యూనిట్లుకు పెంచి అమలు చేయాలని అన్నారు. వృత్తిదారులు, చిరు వ్యాపారస్తులకు సబ్సిడీతో కూడిన విద్యుత్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం తెచ్చిన విద్యుత్ సంస్కరణలను తూచా తప్పకుండా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడాన్ని తీవ్రంగా దుయ్యబట్టారు. 2000లో చంద్రబాబు నాయుడు ప్రపంచ బ్యాంకు చెప్పినట్లుగా విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారాలు వేస్తే ప్రజా పోరాటాలతో వెనక్కునెట్టామని గుర్తు చేశారు. ఆ పోరాటంలో కీర్తిశేషులు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి పాల్గొని విద్యుత్ సంస్కరణలు అమలు చేయబోమని హామీ ఇచ్చారన్నారు. తన తండ్రి హామీలను అమలు చేస్తామని జగన్‌మోహన్‌రెడ్డి చెప్పి నేడు మోడీకి ఊడిగం చేస్తున్నారని దుయ్యబట్టారు. గుజరాత్‌లో అదానీ కంపెనీ తయారు చేసే స్మార్ట్ మీటర్లను ఆయన కంపెనీ ప్రయోజనం కోసం ఇక్కడ పెట్టడం శోచనీయమన్నారు. మీటర్ల ఖర్చు వినియోగదారులపై పడటమే కాకుండా, ముందుగానే అడ్వాన్స్‌గా ఒక్కో మీటరుకు రూ.13 వేలు చెల్లించి విద్యుత్‌ను వినియోగించుకోవాలన్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ఉన్న పోస్ట్ పెయిడ్ పద్ధతికి భిన్నంగా ఈ ప్రీపెయిడ్ పద్ధతి ఉండి ప్రజలపై తీవ్రమైన భారం మోపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బిల్లు చెల్లించడానికి ఆలస్యమైతే పెనాల్టీతో చెల్లిస్తూ విద్యుత్ వినియోగించుకునే అవకాశం ఇప్పటి వరకూ ఉందన్నారు. ఆ పద్ధతిని పూర్తిగా రద్దు చేయడం వినియోగదారుల పాలిట శాపంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు ఎ.విమల, వి.కృష్ణారావు, ఎస్‌కె.రెహమాన్, ఎం.సుబ్బారావు, కె.సత్యనారాయణ, వి.నరేంద్ర కుమార్, జి రాంబాబు, కె.కుమారి, ఎమ్‌డి.భేగం, పి.వెంకటరావు, పి చంద్రశేఖర్, ఎం.మన్మధరావు, సిఎన్ క్షేత్రపాల్, జి.అప్పలరాజు, కె వనజాక్షి, పోలేశ్వరరావు, పి.పద్మ, జి.జయ, ఎన్.నాగభూషణం, యు.నాగరాజు పాల్గొన్నారు.

ఉక్కు ప్రజా గర్జనను జయప్రదం చేయండి

గాంధీ విగ్రహం వద్ద 658 రోజులుగా నిరసన దీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, ఉక్కు నిర్వాసితులందరికీ ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని అధికార, ప్రతిపక్ష పార్టీలు పత్రికల్లో, టీవీల్లో ప్రకటనలు ఇవ్వడం తప్పా ఆందోళన చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో భీంపల్లి రాము, ఎ.కామరాజు, ఎం.సాహెబ్, డి.అప్పారావు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా పార్కుల ఏర్పాటుకు కృషి

కోసం రూ.1.17 కోట్లు, అండర్ పాస్ మెరుగుదల కోసం రూ.42.5 లక్షలు, మీడియన్ గ్రిల్స్ కోసం రూ.1.38 కోట్లు, లైటింగ్ కోసం రూ.54 లక్షలు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. వీటిలో వివిధ రకాల పనులు కోసం రూ.21 కోట్లు ఖర్చు పెట్టామని, రూ.7 కోట్లతో పనులు జరుగుతున్నాయని, రూ.4 కోట్ల పనులు టెండర్ దశలో ఉన్నాయని వివరించారు. తెలుగుతల్లి ఫ్లైఓవర్‌పై వాహనాల రాకపోకలు అధిక వేగంతో ఉన్నాయని, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో రద్దీ ప్రాంతాల్లో ప్రభుత్వ లేదా ప్రైవేట్ స్థలాల్లో రోడ్డు భద్రతా పార్కుల ఏర్పాటుకు అధికారులు కృషి చేయాలన్నారు. దీని వల్ల రోడ్లపై కార్లు, బైకులు నిలుపుదల చేయకుండా నిరోధించవచ్చని అన్నారు. పలు రద్దీ కూడళ్ల వెడల్పు పనులు త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని సూచించారు. రహదారి ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే స్పందించి ఆదుకొనే వారికి రూ.5 వేల చొప్పున పారితోషికాన్ని అందించే విషయంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదం జరిగిన తొలిగంటలో ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడేవారికి నగదుతోపాటు ప్రశంసా పత్రాన్ని అందిస్తామన్నారు.

పలు రైళ్లు రద్దు

బదులు తుని నుంచి బయలుదేరి వెళ్తుంది. కావున జనవరి 21, 22 తేదీల్లో తుని-విశాఖపట్నం మధ్య ఈ రైలు సర్వీసులు ఉండవు. ప్రజలు ఈ మార్పులను గమనించి తదనుగుణంగా నడుచుకోవాలని రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి కోరారు.

ఇద్దరు ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగ్‌లు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : విశాఖ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని విఆర్ విభాగంలో పని చేస్తున్న ఇన్‌స్పెక్టర్లు ఎవి.లీలరావును ఎయిర్‌పోర్టు ప్రోటోకాల్ ఆఫీసర్‌గానూ, టి.ఇమ్మానుయేల్ రాజును ద్వారకా సబ్-డివిజన్ క్రైమ్ విభాగానికి తాత్కాలికంగా కేటాయిస్తూ నగర పోలీస్ కమిషనర్ సిహెచ్. శ్రీకాంత్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని, వారిని విఆర్ నుండి రిలీవ్ చేయాలనీ అడ్మిన్ ఎడిసిపికి ఆదేశాలు జారీ చేశారు.

వెలుగులు మూన్నాళ్ళ ముచ్చటే...

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు పరిధి కొత్తపేట, జ్యూట్ కార్మికవాడలో కొన్ని చోట్ల ఆఘమేఘాల మీద వేసిన వీధి దీపాలు మూన్నాళ్ళ ముచ్చటగానే మిగిలిపోయాయి. పట్టుమని పది రోజులు వెలగకుండానే ఆరిపోయాయి. గత నెల రెండో వారంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఈ ప్రాంతంలో జరిగింది. స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ఆ ప్రాంతంలో పర్యటించేటప్పుడు స్థానికుల నుంచి విమర్శలు రాకూడదన్న ఉద్దేశంతో జివిఎంసి అధికారులు ఆఘమేఘాల మీద పర్యటనకు ముందురోజు వీధి దీపాలు వేశారు. ఎమ్మెల్యే పర్యటన ముగిశాక వీధి దీపాలు వెలగలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగించాలని స్థానిక ప్రజలు, కార్మిక కుటుంబాలు కోరుతున్నాయి.

రీసర్వే పూర్తిచేయాలి

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని వేములవలస గ్రామ పంచాయతీలో ఈ నెల 21 నాటికి భూముల రీ సర్వే పనులు పూర్తి చేయాలని జిల్లా రెవిన్యూ అధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. వేములవలసలో నాలుగు బృందాలుగా సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ బృందంలో ఎన్‌హెచ్ 16 అధికారులు రమేష్, సర్వేయర్ సత్యనారాయణ, విఆర్ఒ లక్ష్మి, గణేష్, అప్పారావు తదితరులు సర్వేలో పాల్గొన్నారు.

గైనిక్ సమస్యలపై అవగాహన

ప్రజాశక్తి - ఆరిలోవ : స్త్రీలు గైనిక్ సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి సూచించారు. ఆరిలోవలోని శ్రీరామనగర్‌లో ఇబ్రన్ జీసస్ ప్రేయర్ హాల్ నందు ఫాదర్ ప్రభుదాస్ ఆధ్వర్యాన గురువారం స్త్రీల గైనిక్ సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేయర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్త్రీలు గైనిక్ సమస్యలపై డాక్టర్ సలహాలు తీసుకోవాలన్నారు. మంచి పోషక ఆహారం తీసుకోవడం ద్వారా సమస్యలను అధిగమించవచ్చని చెప్పారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాల్లో డాక్టర్ల ద్వారా ఉచిత సలహాలు తీసుకొని స్త్రీలు తమ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన 150 మంది మహిళలకు నాప్కిన్స్, హ్యాండ్ వాష్ బాటిల్స్ అందించారు. ఈ కార్యక్రమంలో డిపి హెచ్‌ఎంఒ డాక్టర్ జి.జ్యోతి, ఆరిలోవ ఎఫ్‌ఆర్‌యు డాక్టర్ ఎన్ అనిత, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎ.సంతోష్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

'సింహగిరి వైభవాన్ని చాటాలి'

ప్రజాశక్తి-సింహాచలం: సింహగిరి వైభవాన్ని తెలియజేసే సింహగిరి పత్రిక పరిచయ వేదిక గురువారం స్థానిక ఆర్ఆర్ కల్యాణ మండపంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విశాఖ మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ హాజరై మాట్లాడారు. సింహగిరి వైభవాన్ని ప్రపంచానికి తెలియజేయాలని సింహాచలంలో ఉన్న పవిత్ర స్థలాల విశేషాలను ప్రజలకు అందించే ప్రయత్నం చేస్తున్న సింహగిరి పత్రిక మంచి విజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రధానార్చకులు గొడవర్తి గోపాలకృష్ణ ఆచారి మాట్లాడుతూ, ఎంతో ప్రాచీన చరిత్ర కలిగిన సింహాచలంలో ఎన్నో విశిష్ట జలధారలు ఉన్నాయని, భక్తులకు తెలియజేయాలన్న మంచి సంకల్పంతో ఏర్పాటుచేసిన ఈ పత్రిక మంచి ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పత్రిక ఇన్‌ఛార్జి కర్రి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

రక్షణ గోడ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-యంత్రాంగం

తగరపువలస : రెండో వార్డు పరిధి సత్యనారాయణపేట కొండవాలు ప్రాంతంలో జివిఎంసి నిధులు రూ.74 లక్షలతో నిర్మించ తలపెట్టిన రక్షణ గోడ నిర్మాణ పనులకు స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, వివిధ శాఖల అధికారులు, స్థానిక వైసిపి నాయకులు పాల్గొన్నారు.

రక్షణ గోడ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

పార్కులో వ్యాయామ పరికరాలు

పిఎం పాలెం : జివిఎంసి ఆరో వార్డు పరిధి పిఎం.పాలెం సమీపంలో ఉన్న హెచ్‌పిసిఎల్ లే-అవుట్ రోడ్డు పార్కులో ఏర్పాటుచేసిన వ్యాయామ పరికరాలను భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం కమ్యూనిటీహాల్లో సచివాలయ సెక్రటరీలు, వాలంటీర్లు, కన్వీనర్లతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 38 రకాల సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అవినీతి రహిత పాలనను వైసిపి ప్రభుత్వం అందిస్తుందన్నారు. వాలంటీర్ల సేవలను ప్రశంసించారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి వాలంటీర్లు, కన్వీనర్లు తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోన్ టు కమిషనర్ కె కనకమహాలక్ష్మి, 8వ వార్డు కార్పొరేటర్ లోడగల అప్పారావు, 5, 6, 7 వార్డుల వైసిపి అధ్యక్షులు పోతిన శ్రీనివాస్, బొట్ట అప్పలరాజు, పోతిన హనుమంతు, గాదె రోశి రెడ్డి, పోతిన యల్లాజి, పోతిన ప్రసాద్, పిల్లా రమణబాబు, గుంటుబోయిన సంజీవ్, పోతిన మూర్తిబాబు, పిల్లా సూరిబాబు, రయిన సాయి, జగుపిల్లి నరేష్, కొండపల్లి వరలక్ష్మి, మొజ్జాడ రమణమూర్తి, కుడితి రామారావు పాల్గొన్నారు.

విమ్స్‌లో సిబిఆర్ఎస్ ఏర్పాటుకు ప్రతిపాదన

ప్రజాశక్తి - ఆరిలోవ : పరిశ్రమలు, విపత్తుల్లో ప్రమాదాలకు గురైన వారికి అత్యున్నత చికిత్స అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం సెకండరీ లెవెల్ కెమికల్, బయోలాజికల్, రేడియాలజికల్ అండ్ న్యూక్లియర్ మెడికల్ మేనేజ్‌మెంట్ సెంటర్ (సిబిఆర్ఎస్) ఏర్పాటుకు దేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పాటు పది రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఎనిమిది రాష్ట్రాల్లో సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదలను కేంద్ర ప్రభుత్వం సేకరించింది. అందులో ఎపి నుంచి విమ్స్ ఆసుపత్రిలో ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలను పంపించింది. ఈ సందర్భంగా విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ, విమ్స్‌లో సిబిఆర్ఎస్ సెంటర్‌ను ఏర్పాటుచేయడం ఆనందంగా ఉందన్నారు. విశాఖపట్నం పరిసర ప్రాంతాల పరిశ్రమల్లో ప్రమాదం జరిగేటప్పుడు క్షతగాత్రులకు ఈ కేంద్రం ద్వారా అత్యున్నత వైద్యం అందించడం జరుగుతుందన్నారు. ఈ కేంద్రం ఏర్పాటుకు విమ్స్ ఆసుపత్రిని ప్రతిపాదించడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజనికి కృతజ్ఞతలు తెలిపారు.

కరాటే క్రీడాకారులకు అభినందనలు

కరాటే క్రీడాకారులను అభినందిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

ప్రజాశక్తి - ఆరిలోవ : నేపాల్ దేశంలోని కరాటే పోటీలలో గెలుపొందిన క్రీడాకారులను 11వ వార్డు క్యాంప్ కార్యాలయంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దేశ, విదేశాలలో విశాఖ కీర్తిని పెంపొందిస్తున్న కరాటే క్రీడాకారులను నగర ప్రజలు గుర్తించుకుంటారన్నారు. మన క్రీడాకారులు నేపాల్‌లోని లుంబినిలో జరిగిన గౌతమ బుద్ధ అంతర్జాతీయ స్థాయి కరాటే ఓపెన్ ఛాంపియన్‌షిప్ - 2023 పోటీలకు భారతదేశం నుంచి 14 టీములు పాల్గొన్నాయని, ఆంధ్రప్రదేశ్ నుంచి ఏపీ వోడో - ర్యూకింగ్ ఆఫ్ కరాటే ఛాంపియన్ డోజో నుంచి 15 మంది కరాటే క్రీడాకారులు పాల్గొన్నారని, వారిలో ఎనిమిది బంగారు, ఆరు వెండి, ఐదు కాంస్య పతకాలు సాధించడం ఎంతో సంతోషకరమన్నారు. కరాటే పోటీలలో మంచి ఫలితాలు సాధించేందుకు ఉత్తమ ప్రతిభ కనబరిచిన అసోసియేషన్ చీఫ్ కోచ్ శ్రీనివాసరావును, క్రీడాకారులను ఇతర కోచ్‌లను మేయర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు గొలగాని శ్రీనివాసరావు, బి.వెంకటరావు, కన్నారావు, కరాటే మాస్టర్ చిన్నారావు, రమణమూర్తి, సూరరాజు, గోపాలరావు, అప్పలరాజు, హరినాధరావు తదితరులు పాల్గొన్నారు.

నవోదయ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -పిఎం పాలెం : విశాఖపట్టణం ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 11వ తేదీన నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి జూనియర్ సబ్ జూనియర్ పారా అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీల్లో కొమ్మాది సమీపంలో ఉన్న నవోదయ పాఠశాల విభిన్న ప్రతిభావంతులు పలు పతకాలు సాధించినట్లు ప్రిన్సిపల్ కె.సంజయ్ తెలిపారు. 8వ తరగతి విద్యార్థిని కే.తేజశ్రీ 100 మీటర్ల స్ప్రింట్ విభాగంలో స్వర్ణ పతకాన్ని, 400 మీ.స్ప్రింట్ విభాగంలో రజత పతకాన్ని గెలుపొంది ఈ నెల 27న గుజరాత్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. 6వ తరగతి విద్యార్థి సల్మాన్‌కుమార్ 100, 400 మీటర్ల స్ప్రింట్ విభాగంలో కాంస్య పతకాన్ని, 7వ తరగతి విద్యార్థిని జి.తేజస్విని వంద మీటర్ల విభాగంలో కాంస్య పతకం, 9వ తరగతి విద్యార్థిని కృష్ణ తేజస్విని షాట్ పుట్ విభాగంలో కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్, సిబ్బంది అభినందించారు. వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు ఎమ్‌వి.రమణమ్మ, నీలా ప్రసాద్‌లను ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించారు.

పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపల్ సంజయ్

నేరాలు ఘోరాలు

గోస్తనీలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- తగరపువలస : ఆనందపురం మండలం ఎగువ యాతపేటకు చెందిన గీత కార్మికుడు ఎం.శ్రీను (33) మృత దేహం స్థానిక గోస్తనీలో గురువారం లభ్యమైంది. భీమిలి పోలీసుల కథనం ప్రకారం... భీమిలి మండలం కృష్ణంరాజుపేటలో ఉన్న అత్తవారింటికి సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 15 న ఎం.శ్రీను వచ్చాడు. భార్య గురమ్మతో ఈ నెల 17వ తేదీన గొడవ పడ్డాడు. అదే రోజు సాయంత్రం నుంచి కనబడ లేదు. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా గురువారం స్థానిక గోస్తనీలో మృతదేహం లభ్యమైంది. మృతుడు ఎం.శ్రీనుగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం పోలీసులు భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ గంటా హరీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు శ్రీనుకు గురమ్మతో సుమారు 9 ఏళ్ల క్రితం పెళ్లయింది. ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గోస్తనీలో దూకి ఆత్మ హత్య చేసుకున్నాడా?, ప్రమాదవశాత్తూ పడి మృతి చెందాడా? అన్నది పోలీసుల విచారణలో తేలనుంది.

గంజాయితో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి -కలెక్టరేట్ (విశాఖ)

విశాఖ వన్‌టౌన్ ప్రాంతంలో గంజాయి కలిగి ఉన్న ముగ్గురు వ్యక్తులను గురువారం వన్‌టౌన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు కిలో గంజాయి, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం... వెలంపేట మున్సిపల్ స్టేడియం వెనుక భాగంలో గంజాయి వ్యాపారం జరుగుతుందని జె.పురుషోత్తం అనే వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ కె.శంకరరావు ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం ఆకస్మికంగా దాడి చేశారు. పోలీసులు వచ్చారని తెలిసి పారిపోవడానికి ప్రయత్నించిన మహమ్మద్ ఖుర్షిద్(31), మహమ్మద్ ముస్తాక్ (33), షేక్ సియాజ్ ఖాన్ (50)ను పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరు ఫిషింగ్ హార్బర్ కంచరవీధిలో నల్లమందును 30 గ్రాముల ప్యాకెట్లతో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. కేసును వన్ టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

టైర్ల కంపెనీలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి -గాజువాక : శ్రీనగర్ పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న జితేందర్ రాయ్ టైర్ల కంపెనీలో గురువారం ఉదయం మంటలు చెలరేగాయి. టైర్లు దగ్ధమయ్యాయి. జితేందర్ రాయ్ పాత టైర్లను బాగు చేసి, సెకండ్ హ్యాండ్‌గా అమ్మకాలు చేస్తుంటారు. గురువారం ఉదయం వంట చేస్తుండగా టైర్లకు నిప్పంటుకుంది. దీంతో షాపులో ఉన్న టైర్లన్నీ కాలి బూడిదయ్యాయి. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

పాఠశాలల పరిశీలన

ప్రజాశక్తి-పద్మనాభం : పిఎం శ్రీ యోజన పథకం కింద మండలంలోని రెడ్డిపల్లి, రేవిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, అనంతవరం, రౌతుపాలెం ప్రాథమిక పాఠశాలలను ఆ పథకం రాష్ట్ర ప్రత్యేకాధికారి వెంకటలక్ష్మి గురువారం పరిశీలించారు. ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పేరుతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసే కార్యక్రమంలో భాగంగా నాలుగు పాఠశాలను ఎంపికచేసి స్థానిక అధికారులు కేంద్రానికి పంపించారు. దీంతో ఆయా పాఠశాలలను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం సమగ్రశిక్షా ఎఎంఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోని బోయపాలెం, బొడ్డపాలెం, ఆనందపురం, లోడగలవానిపాలెం, సొంట్యాం తదితర పాఠశాలలను పాఠశాల విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.వెంకటలక్ష్మి సందర్శించారు. బోయపాలెం పాఠశాలలో పలు ప్రశ్నలు వేసి విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనావేశారు. ఐదు, ఎనిమిది తరగతుల విద్యార్థులు వర్క్ బుక్‌లు ఎలా చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఆనందపురం పాఠశాలలో లైబ్రరీ, ల్యాబ్ గదులను పరిశీలించారు. లోడగలవానిపాలెంలో టీవీ ద్వారా విద్యాబోధనపై ఆరాతీశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. సొంట్యాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంకుడు గొయ్యిలను పరిశీలించారు. ఆమె వెంట ఎంఇఒ ఎస్.పద్మావతి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న వెంకటలక్ష్మి

జంతు సంరక్షణ చట్టాలను గౌరవించాలి

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఔషధ ప్రయోగాలకు జంతువులను వినియోగించే పరిశోధకులు జంతు సంరక్షణ చట్టాలను విధిగా గౌరవించాలని, ఎంతో అవసరం అనుకుంటే తప్ప వాటిపై ప్రయోగాలను జరపరాదని భారత ప్రభుత్వ జంతు సంక్షేమ విభాగం సంయుక్త కమిషనర్, కమిటీ ఫర్ కంట్రోల్ అండ్ సూపర్‌విజన్ ఆఫ్ ఎక్స్‌పరిమెంట్స్ ఆన్ యానిమల్స్ మెంబర్ సెక్రటరీ డాక్టర్ ఎస్.కె.దత్తా సూచించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా దక్షిణాది రాష్ట్రాల విశ్వవిద్యాలయాలు, ఫార్మసీ కళాశాలలలోని పరిశోధకులకు కేంద్రప్రభుత్వం నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణా కార్యక్రమాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మనుషుల మాదిరిగా జంతువులకు మానసిక, శారీరక ఆరోగ్యం అవసరమని, అది లోపించిన పక్షంలో దాని ప్రభావం మానవ సమాజంపై పడుతుందని గుర్తించాలన్నారు. ఒకే విధమైన ఔషధ ప్రయోగాలను జంతువులపై చేయకుండా పరిశోధకుల మధ్య సమాచార భాగస్వామ్యం అవసరమన్నారు. జంతువులపై ప్రయోగాలను సమీక్షించడాని జాతీయ స్థాయిలో 19 మంది సభ్యులతో కమిటీ ఫర్ కంట్రోల్ అండ్ సూపర్‌విజన్ ఆఫ్ ఎక్స్ పరిమెంట్స్ ఆన్ యానిమల్స్ పనిచేస్తోందని వెల్లడించారు. దేశంలోని 17 వేల విద్యాలయాలు, పరిశోధనా సంస్థలు ఎథిక్స్ కమిటీలను ఏర్పాటు చేసుకున్నాయని తెలిపారు. ఈ కమిటీల అనుమతి పత్రం లేకుండా జంతువులపై ఏ విధమైన పరిశోధనలు జరిపినా, పరిశోధనా ఫలితాలు ప్రకటించినా వాటికి గుర్తింపు ఉండదన్నారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) ప్రొ వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి మాట్లాడుతూ ఔషధ ప్రయోగాలకు జంతువులను వాడటం క్రమేణా తగ్గుముఖం పడుతోందని, ప్రత్యామ్నాయ మార్గాలపై పరిశోధకులు దృష్టి సారించాలన్నారు. ప్రొఫెసర్ మళ్ళ రామారావు, ప్రొఫెసర్ గణపతి, కమిటీ ఫర్ కంట్రోల్ అండ్ సూపర్‌విజన్ ఆఫ్ ఎక్స్‌పరిమెంట్స్ ఆన్ యానిమల్స్ జాతీయ సలహాదారులు డాక్టర్ కృపాలి పాండే, డాక్టర్ రీవా రౌతేల, డాక్టర్ సమీక్షా సక్లాని, ఎయు ఫార్మకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ కె.ఈశ్వర్ కుమార్ పాల్గొని ప్రసంగించారు.

పార్కులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

52వ వార్డులో డిప్యూటీ మేయర్ పర్యటన

ప్రజాశక్తి -కరాస: జివిఎంసి 52వ వార్డులో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ గురువారం అన్ని శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. వార్డులోని కరాస, శాంతినగర్, గౌరీ నగర్ పార్కులలో మౌలిక సదుపాయాలు, ఆధునికీకరణపై అధికారులతో శ్రీధర్ చర్చించారు. ఉడా లే-అవుట్ గ్రీన్ బెల్ట్ ఆధునికీకరణ, కరాస జివిఎంసి పాఠశాలను నాడు - నేడు పథకం కింద అభివృద్ధి చేయాలని ఆదేశాలు జారీచేశారు. వార్డులో అన్ని ప్రాంతాలలో సిసి, బిటి రోడ్లు, డ్రెయినేజీలు, వీధి దీపాలు, మరమ్మత్తుల పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ ఎడిహెచ దామోదర్, డిఇ ఏడుకొండలు, ఎఇ ఉష, వాటర్ సప్లయ్ ఎఇ గణేష్, సచివాలయ సెక్రటరీలు, వైసిపి నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదగాడి చెరువు కబ్జాపై ఆర్‌డిఒకు ఫిర్యాదు

ప్రజాశక్తి-కలెక్టరేట్

పెందుర్తి మండలం పెదగాడి పంచాయితీ పరిధి సర్వే నెంబర్ 420లో ప్రభుత్వ చెరువును వైసిపికి చెందిన మాజీ సర్పంచి కోన శ్రీనివాసరావు కబ్జా చేసి ప్లాట్లు వేసి అమ్మేస్తున్నారని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఆరోపించారు. గురువారం పెదగాడి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్తలతో కలిసి ఆర్‌డిఒ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేశారు. అనంతరం బండారు మీడియాతో మాట్లాడుతూ ఇదే అంశంపై పెందుర్తి తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశామని, వారం రోజులైనా ఆయన కనీసం స్పందించలేదని తెలిపారు. పెందుర్తి అధికార పార్టీ ఎమ్మెల్యే అదీప్ రాజ్ తహశీల్దారుకు హుకుం జారీ చేయడంతో ఆయన ఎటువంటి చర్యలు తీసుకోకుండా మిన్నకుండిపోయారని ఆరోపించారు. అందుకే ఆర్‌డిఓను కలిసి సర్వే నెంబర్ 420లో జరుగుతున్న కబ్జాపై ఫిర్యాదు చేశామని, దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే హైకోర్టుకు వెళ్తామని హెచ్చరించారు. ఒకవేళ తాను తప్పుడు ఆరోపణలు చేశానని నిరూపిస్తే ఇదే కలెక్టరేట్ దగ్గర ఆత్మహత్య చేసుకుంటానన్నారు. చింతగట్ల గ్రామంలో వైసిపి నేత కనకరాజు జుత్తాడలో ఎస్‌సి సామాజిక తరగతి వారికి చెందిన నాలుగు ఎకరాల భూమిని ఆక్రమిస్తున్నారని ఆరోపించారు.

భవిష్యత్తు ప్రణాళికలు రచించాలి

ప్రజాశక్తి-విశాఖపట్నం : విశ్వవిద్యాలయంలో చేరిన తొలిరోజు నుంచే భవిష్యత్తుకు అవసరమైన అభివృద్ధి ప్రణాళిక రచించుకుని, అమలు చేసుకోవాలని ఏయూ వీసీ ఆచార్య పివిజి.ప్రసాదరెడ్డి సూచించారు. గురువారం ఉదయం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో సైన్స్ కళాశాల విద్యార్థులతో నిర్వహించిన స్వాగత సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నూతన చరిత్రను లిఖించే విధంగా పనిచేయాలన్నారు. నిరంతరం గ్రోత్ మైండ్‌సెట్‌ను కలిగి ఉండాలని సూచించారు. వర్సిటీలో ఉన్న కాలాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ కోర్సులు, పుస్తకాలు చదవడం, నూతన జ్ఞానాన్ని, నైపుణ్యాలను పొందడానికి కృషిచేయాలని సూచించారు. విద్యార్థులు ఉపాధిని సాధించడం, స్టార్టప్‌లుగా ఎదగడం అనే రెండు లక్ష్యాలను ఎంపిక చేసుకుని తదనుగుణంగా పనిచేయాలని కోరారు. ప్రశ్నించడం నుంచి ఆలోచన ఉద్భవిస్తుందన్నారు. సమాజంలో మనం చూసే సమస్యలే అవకాశాలను అందిస్తాయని చెప్పారు. ఆచార్యులు బోధనతో విద్యార్థుల హృదయాలలో స్థానం పొందాలన్నారు. ఆచార్యుల్లో జవాబుదారీతనం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక మానవ మేధస్సుకు సవాళ్లు విసురుతుందని తెలిపారు. విశ్వవిద్యాలయంలో అకడమిక్ క్యాలెండర్‌ను పటిష్టంగా అమలు చేస్తామన్నారు.

ఎయు టిడిఆర్ హబ్ పోర్టల్ ప్రారంభం

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం ట్రాన్స్ డిసిప్లేనరీ హబ్ పోర్టల్‌ను ఏయూ వీసీ ఆచార్య పివిజి ప్రసాదరెడ్డి గురువారం ప్రారంభించారు. తన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పోర్టల్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఇప్పటికే ప్రవేశాలు పొందిన పరిశోధకులు, రీసెర్చ్‌గైడ్‌లు శనివారంలోగా తమ వివరాలు సమగ్రంగా పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని డీన్ జేమ్స్ స్టీఫెన్ సూచించారు. నూతనంగా ఏర్పాటు చేసిన పోర్టల్‌లో ట్రాన్స్ డిసిప్లేనరీ హబ్‌లో ప్రవేశాలు పొందిన పరిశోధకులు, రీసెర్చ్ గైడ్‌ల వివరాలు సమగ్రంగా నమోదు చేయడం సాధ్యపడుతుందని తెలిపారు.

నేడు ఎంఎస్‌ఎంఇ ఎక్స్‌పో

ఎక్స్‌పోకు సిద్ధమైన స్టాళ్లు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఆటోనగర్‌లో వాసవి ఆఫీస్ వద్ద ఈ నెల 20, 21 తేదీల్లో ఎంఎస్‌ఎంఇ ఎక్స్‌పో-2023 నిర్వహించనున్నారు. మొదటి రోజు ప్రదర్శనకు స్టీల్‌ప్లాంట్ సిఎండి అతుల్‌బట్ హాజరుకానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ పరిశ్రమలకు సంబంధించిన ఉత్పత్తులను ప్రదర్శించనున్నారు. మొత్తం 70 స్టాల్స్ వరకు ఏర్పాటుచేశారు. చిన్న తరహా, మధ్య తరగతి పరిశ్రమలకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నూతన రాయితీలను ఎంఎస్‌ఎంఇ అధికారులు వివరించనున్నారు. ప్రతి ఏటా డిసెంబర్‌లో నిర్వహించే ప్రదర్శన ఈ ఏడాది జనవరి నెలకు మార్పు చేశారు. కరోనా సమయంలో రెండేళ్ళ ఏర్పాటు చేయకుండా రద్దు చేసిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన ఏర్పాట్లు అన్నిటిని అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. వాసవికానుకొని ఉన్న ఖాళీ ప్రదేశంలో స్టాల్స్ ఏర్పాటు చేశారు.

నేడు జాబ్ మేళా

ప్రజాశక్తి -కంచరపాలెం: విశాఖపట్నం జిల్లాలోని బిగ్ బాస్కెట్ కంపెనీలలో గల 60 ఉద్యోగాల భర్తీకి కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.సుధ (టెక్నికల్) ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థలో పిక్కర్స్ ఉద్యోగాలు 20 ఖాళీలకు పదవ తరగతి అర్హత కలిగి 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి రూ.13,500 జీతం, పిఎఫ్, ఇఎస్‌ఐ, పిఎం ఉంటాయని వివరించారు. రైడర్స్ అండ్ బైకర్స్ ఉద్యోగాలు 20 ఖాళీలకు పదవ తరగతి అర్హతతో డ్రైవింగ్ లైసెన్స్ కలిగి, 18 నుంచి 35 సంవత్సరాల వయసు గలవారు అర్హులని తెలిపారు. వీరికి రూ.18 వేల నుంచి రూ.22 వేలు జీతం, పిఎఫ్, ఇఎస్‌ఐ, పిఎం ఉంటాయని వివరించారు. అసోసియేటివ్ ఉద్యోగాలు పది ఖాళీలకు పదవ తరగతి అర్హతతో 18 నుంచి 35 సంవత్సరాల వయసు గలవారు అర్హులని పేర్కొన్నారు. వీరికి రూ.13,500 జీతం, పిఎఫ్, ఇఎస్‌ఐ, పిఎం ఉంటాయని తెలిపారు. ఏరియా రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలు 10 ఖాళీలకు గ్రాడ్యుయేషన్ అర్హతతో 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గలవారు అర్హులని, వీరికి సంవత్సరానికి రూ.2.8 లక్షలు, పిఎఫ్, ఇఎస్‌ఐ, పిఎం ఉంటాయని వివరించారు. అర్హత ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. అభ్యర్థులు తమ వివరాలను ncs.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు.

గల్లంతైన మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-పెందుర్తి : 88వ వార్డు పరిధి నరవ శివారు క్వారీలో దువ్వాడ ప్రాంతానికి చెందిన యశ్వంత్ (20) కాలుజారి బుధవారం గల్లంతయ్యాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు గజ ఈతగాలతో గాలింపు చేపట్టారు. గురువారం మధ్యాహ్నానికి మృతదేహం లభించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేశారు.

అప్పికొండ కాలనీలో పరస

ప్రజాశక్తి-గాజువాక : జివిఎంసి 87వ వార్డు పరిధి కణితి అప్పికొండ రామాయలం వద్ద గురువారం పరస నిర్వహించారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పరసకు హాజరై రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పరసలో తప్పెటగుళ్ళు, కోలాటం, గరిడీలు, భజనలు, చెక్క భజనలను తిలకించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ప్రగడ వేణుబాబు, బొడ్డ గోవింద్, దుగ్గపు దానప్పలు, సిహెచ్.వి.రమణ, ఆడారి శ్రీను, ఎన్నేటి రమణ, ప్రగడ శ్రీనివాస్, దాక సత్తిబాబు, రామాలయ కమిటీ సభ్యులు వెంకునాయుడు, వై.రమణ, సోముబాబు, బ్రాహ్మం, గణపతి, లక్కరాజు రామారావు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

48వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 48వ వార్డు పరిధి బాపూజీనగర్, బర్మాక్యాంప్, శ్రీనివాసనగర్ ప్రాంతంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, వార్డు ఇన్‌ఛార్జి నీలి రవితో కలిసి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఇప్పటివరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ ఫలాలను వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. మౌలిక వసతులు అభివృద్ధి చేసి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా పనిచేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాత కార్పొరేషన్ ఛైర్మన్ పిల్లి సుజాత, డైరెక్టర్లు రాయుడు శ్రీను, దిడ్డి రమేష్, సమ్మెట్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీచేస్తున్న కెకె.రాజు

వైఎస్ఆర్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి -ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి ఆరిలోవ కాలనీ హెల్త్ సిటీ మైదానంలో వార్డు కార్పొరేటర్ కెల్ల సునీతసత్యనారాయణ ఆధ్వర్యాన వైఎస్ఆర్ సిఎం కప్-2023 క్రికెట్ టోర్నమెంట్‌ను విశాఖ తూర్పు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువ క్రీడాకారులను ప్రోత్సహించాలని స్థానిక కార్పొరేటర్ చేపట్టిన ఈ టోర్నమెంట్‌లో తూర్పు నియోజకవర్గం పరిధిలోని 15 వార్డులకు సంబంధించి 40 టీమ్‌లు పాల్గొంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఉమ్మడి స్వాతి దాస్, అక్కరమాని రోహిణి, 19వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి సూరడ వెంకటలక్ష్మి, ఫారెస్ట్ డైరెక్టర్ వంం వరలక్ష్మి, వార్డు వైసిపి మహిళా అధ్యక్షురాలు శిరీష, సచివాలయ కన్వీనర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న విజయనిర్మల

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

మాట్లాడుతున్న కలెక్టర్ రవిసుభాష్ పట్టన్‌శెట్టి

ప్రజాశక్తి - అనకాపల్లి : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ రవిసుభాష్ పట్టన్‌శెట్టి వెల్లడించారు. గురువారం కలెక్టరేట్‌లో రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ రవాణా, పోలీస్ శాఖలు చేపట్టిన చర్యలతో రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గుతున్నాయన్నారు. ఈ ఏడాది40 శాతం ప్రమాదాల నివారణ లక్ష్యంగా అధికారులు పనిచేయాలన్నారు. త్వరలో అనకాపల్లి, రాజమండ్రి జాతీయ రహదారి విస్తరణ నేపథ్యంలో తీసుకోవలసిన ముందస్తు చర్యలను వివరించాలన్నారు. సూచికలు, హెచ్చరిక బోర్డులు, స్టాపర్ స్టాండ్స్, రేడియం స్టిక్కర్లు ఏర్పాటుకు సిఎస్ఆర్ నిధులను ఉపయోగించుకోవాలన్నారు. ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలన్నారు.

జిల్లా ఎస్పి గౌతమి శాలి మాట్లాడుతూ అధిక ప్రమాదాలు, ప్రమాదాలకు ఆస్కారమున్న ప్రాంతాలను గుర్తించి, అక్కడ ఆక్రమణల తొలగింపు, స్పీడ్ బ్రేకర్లు, సిసి కెమెరాల ఏర్పాటు వంటి చర్యలు తీసుకుంటున్నా మన్నారు. జిల్లా రవాణాశాఖ అధికారి ఎం వీర్రాజు మాట్లాడుతూ గత సమావేశంలో సభ్యుల సలహా మేరకు జిల్లాలో ట్రాఫిక్ నియంత్రణకు తీసుకున్న చర్యలు, మున్ముందు చేపట్టబోయే చర్యలపై పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో డిఆర్ఒ వెంకటరమణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ , జాతీయ రహదారి అధికారి శివశంకర్, డిఆర్‌డిఎ పిడి లక్ష్మీపతి, ఆర్అండ్‌బి ఇఇ, రవాణా, పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ప్రభుత్వ పథకాల అమలుపై వృద్ధురాలి ప్రశ్నిస్తున్న మంత్రి అమర్

ప్రజాశక్తి- అనకాపల్లి : మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్‌అన్నారు. గురువారం మండలంలోని అక్కిరెడ్డిపాలెం గణేష్ నగర్, సీరంశెట్టివానిపాలెం, తారకరామానగర్ కాలనీల్లో ఎంపీ సత్యవతి, దిలీప్‌కుమార్, ఎంపిపి గొర్లె సూరిబాబుతో కలిసి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అమలుపై ఆరా తీశారు. గ్రామంలో అపరిష్కృతంగా ఉన్న గణేష్ నగర్ ఓవర్ హెడ్ ట్యాంకు, మురుగునీటి కాలువల నిర్మాణం, రక్షిత మంచినీటి సౌకర్యాలకు కల్పనకు కృషి చేస్తామన్నారు. దీనిపై తక్షణ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో వైసిపి జిల్లా అధికార ప్రతినిధి మల్ల బుల్లి బాబు, గ్రామ సచివాలయ కన్వీనర్ నారపిన్ని ప్రసాద్, మామిడి ధనలక్ష్మి, సీరం శెట్టి అప్పలరాజు, మాజీ సర్పంచ్ బోయినపల్లి రఘు, రాజశేఖర్, బోండా అప్పారావు పాల్గొన్నారు.

బిజెపి వైఫల్యాలను ఎండగట్టడమే 'హాత్ సే హాత్ జోడో' లక్ష్యం

మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత భానుమూర్తి యాదవ్

ప్రజాశక్తి-అనకాపల్లి : కేంద్రంలో ఎనిమిదేళ్ల పాలనలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యపరిచేందుకు 'హాత్ సే హాత్ జోడో' కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి బోయిన భానుమూర్తి యాదవ్ వెల్లడించారు. గురువారం పార్టీ సీనియర్ నాయకులు, పిసిసి మాజీ సభ్యులు పిఎస్ దత్తు స్వగృహంలో నియోజకవర్గ నాయకులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ఈనెల 30న ముగుస్తుందని, అదే స్ఫూర్తితో జనవరి 26 నుంచి మార్చి 26 వరకు హాత్ సే హాత్ జోడో అభియాన్ కార్యక్రమాన్ని అన్ని నియోజకవర్గాల్లో నిర్వహించి, కేంద్రంలో బిజెపి ప్రభుత్వ వైఫల్యాలను, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంతోనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కత్తెర శ్రీధర్, మండల పార్టీ అధ్యక్షులు కాళ్ల వెంకట సత్యనారాయణ, యువజన కాంగ్రెస్ నాయకులు బి బాలమురళి పాల్గొన్నారు.

ఎల్ఐసిని ప్రయివేటీకరించొద్దు

భోజన విరామ సమయంలో ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-చోడవరం : జాతీయబీమా సంస్థ ఎల్ఐసిని ప్రయివేటీకరించకుండా ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని ఎల్ఐసి ఉద్యోగులు డిమాండ్ చేశారు. గురువారం ఎల్ఐసి జాతీయ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎల్ఐసి కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో ఉద్యోగులు నిరసన చేపట్టారు. 1956లో జాతీయీకరణ తర్వాత ఎల్ఐసి దినదినాభివృద్ధి చెందుతూ, ప్రభుత్వానికి, ప్రజలకు బాసటగా నిలిచిందని, లక్షల కోట్ల ఆస్తులను సమకూర్చుకుందన్నారు. అలాంటి సంస్థను ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టడం దుర్మార్గమన్నారు. ఎల్ఐసితోపాటు ఇతర ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి కల్యాణ్ కుమార్, సహాయ కార్యదర్శి నూకరాజు, కోశాధికారి హర్షత్, సభ్యులు పద్మజ, కెపిఎస్ఎన్ రెడ్డి పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న ఎల్ఐసి ఉద్యోగులు

దేవాలయ భూముల పరిరక్షణకు చర్యలు

మారేపల్లిలో భూమిని పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- దేవరాపల్లి: ప్రభుత్వ ఆదేశాల మేరకు దేవాలయ భూముల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు దేవాదాయశాఖ జిల్లా అధికారి బుద్ధ మహాలక్ష్మి గణేష్ స్పష్టం చేశారు. గురువారంమండలంలోని మారేపల్లి రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 115లో 23.15ఎకరాలతోపాటు గ్రామంలోని వివిధ సర్వే నెంబర్లలో ఉన్న 43.12ఎకరాల దేవాదాయశాఖ భూమికి సంబంధించి రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తున్నామన్నారు.

గురువారం మారేపల్లిలో విఆర్ఒ, విఆర్ఎల సహకారంతో ఆలయ భూములను పరిశీలించారు. మరింత సమాచారం కోసం రెవెన్యూ రికార్డులను అడిగారు. దేవాలయ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందన్నారు. అలాగే దేవాలయ భూముల్లోని పండ్ల తోటల దురాక్రమణ, వాటి ఫలసాయాన్ని అనధికారికంగా పొందుతున్న వారికి త్వరలో నోటీసులు జారీ చేసి ఆయా తోటలు, భూములను స్వాధీనం చేసుకోవాలని ఆ శాఖ ఇన్‌స్పెక్టర్లకు ఆదేశించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ ఉన్నారు.

జిరాయితీ భూమి కబ్జా అవాస్తవం

ప్రజాశక్తి- కె.కోటపాడు : రైతుల జిరాయితీ భూమి కబ్జాకు ప్రయత్నం చేస్తున్నారని తన భర్త చల్లా సింహాద్రినాయుడుపై వచ్చిన వార్తల్లో నిజం లేదని కె. సంతపాలెం సర్పంచ్ చల్లా మంగ ఖండించారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ కె.సంత పాలెం పంచాయతీ పరిధిలో 127/67, 18/ 21, 126 / 27 సర్వేనెంబర్లలోని సుమారు రెండెకరాల భూమి గడచిన వందేళ్లుగా నిరుపయోగంగా ఉందన్నారు. ఈ స్థలంలో 2016లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు పంచాయతీ తీర్మానం చేసినప్పటికీ, కాలేజీ కె.కోటపాడు తరలి పోయిందన్నారు. తర్వాత అదే స్థలంలో కోల్డ్‌స్టోరేజీ ఏర్పాటుకు పంచాయతీ తీర్మానం చేసిందన్నారు. ఇదే స్థలంలో జగనన్న కాలనీలో భాగంగా కొందరి పట్టాలు కేటాయించగా, మిగిలినస్థలాన్ని ఆక్రమించుకునే క్రమంలోనే ఆరోపణలు చేస్తున్నారన్నారు. మిగిలిన స్థలంలో కూడా జగనన్న ఇంటి స్థలాలను పేదలకు పట్టాలు ఇవ్వాలని తహశీల్దారును కోరినట్లు సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులు వెల్లడించారు. నిరుపయోగంగా ఉన్న స్థలాన్ని గ్రామానికి చెందిన చల్లా వెంకటరమణ ఆధ్వర్యంలో బండారు దేవుళ్ళ, చల్ల ప్రసాదు, చల్లా రామనాయుడు, చల్లా నాయుడు, చల్లా శ్రీను, చల్లా సన్నిబాబు, చల్లా అప్పారావు, కసిరెడ్డి దేవుళ్ల ఆక్రమించేందుకు రాత్రికిరాత్రే జెసిబిలు తీసుకొచ్చి స్థలాన్ని చదును చేసేందుకు యత్నించగా, గ్రామసర్పంచ్‌గా తాను, మరికొందరు పెద్దలు అడ్డుకున్నామన్నారు. సమావేశంలో వైస్ ప్రెసిడెంట్ చల్లా వెంకటరమణ, వార్డు మెంబర్లు కొచ్చర్ల గంగాభవానీ, బర్ల కృష్ణవేణి, చల్లా గోవిందరావు, రామ నాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సంతపాలెం సర్పంచ్ మంగ,

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

రేషన్ డిపోను పరిశీలిస్తున్న రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు కాంతారావు

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి కాంతారావు స్పష్టం చేశారు. గురువారం పట్టణంలోని కోట్ని వీధి, గాంధీనగర్‌లోని రేషన్‌డిపోలను తనిఖీ చేశారు. అలాగే భీముని గుమ్మం, సంతోషిమాత గుడి వీధి, దాసరిగడ్డ వీధిలో అంగన్వాడి కేంద్రాలను తనిఖీలు నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాల్లో సరుకులకు సంబంధించినరికార్డులను పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. పట్టణ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం ఇస్తున్నది లేనిది అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్, విద్యాశాఖ అధికారి ప్రేమ్‌కుమార్,డిఎస్ఒ కెవిఎస్ఎం.ప్రసాద్, ఎస్ఒలు కల్యాణి నందకిషోర్, సిఎస్‌డిటిలు, ఆర్ఐలు, ఐసిడిఎస్, సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కొండపాలెంలో 'ఇదేం ఖర్మ'

మత్స్యకారులతో మాట్లాడుతున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండలంలోని పూడిమడక శివారు కొండపాలెం గ్రామంలో గురువారం తెలుగుదేశం పార్టీ మండల నాయకుడు మెరుగు బాబునాయుడు ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి, మత్స్యకారులు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైసిపి ప్రభుత్వ పాలనలో తమకు ఎటువంటి సబ్సిడీ పరికరాలు, ఇంజన్లు, ఇతర పథకాలు ఇవ్వలేదని పలువురు మత్స్యకారులు టిడిపి నేతల దృష్టికి తెచ్చారు. సముద్రతీరంలో చేపల పట్టే వారి దగ్గరికి వెళ్లి వైసిపి ప్రభుత్వ విధానాలతో ప్రజలు పడుతున్న అవస్థలపై వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి తగిన బుద్ధి చెప్పాలని, చంద్రబాబు సమర్థ నాయకత్వానికి మద్దతునిచ్చి టిడిపిని గెలిపించాలని కోరారు.

కుంచంగి ఎంపిటిసి మృతి

నివాళులర్పిస్తున్న మంత్రి అమర్, ఇన్‌సెట్‌లో సత్యం దొర(ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి- అనకాపల్లి : మండలంలోని కుంచంగి గ్రామానికి చెందిన ఎంపిటిసిసభ్యులు పల్లెల శివ సత్యం దొర గురువారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన వైసిపి జిల్లా కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఆయన మృతి పట్ల మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎంపీ డాక్టర్ సత్యవతి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, ఎంపిపి గొర్లి సూరిబాబు, వైసీపీ పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, వైసిపి కార్పొరేటర్లు మందపాటి సునీత, జాజుల ప్రసన్న లక్ష్మి రమేష్, అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పలక యశోద రవి, వైసిపి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వైసిపి శ్రేణులు సంతాపం తెలిపారు. సత్యందొర అంత్యక్రియలు శుక్రవారం వారి స్వగ్రామం కుంచంగిలో నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు, వైసిపి నేతలు తెలిపారు.

'డైట్'లో ప్రాంగణ నియామకాలు

ప్రాంగణ నియామకాల్లో ఎంపికైన విద్యార్థులు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ప్రాంగణ నియామకాలు జరిగాయి. ఎంబిఎ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఐసిఐసిఐ బ్యాంకు హెచ్ఆర్ టీం ఇంటర్వ్యూలు నిర్వహించింది. 30 మంది విద్యార్థులు పాల్గొనగా 12 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అసిస్టెంట్ మేనేజర్ కేడర్‌లో ఎంపికైన వీరికి ఏడాదికి రూ.3.84లక్షల ప్యాకేజీ ఇస్తారన్నారు. క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహం, వైస్ ప్రిన్సిపాల్ వైకుంఠరావు, ఎంబిఎ విభాగాధిపతి డాక్టర్ పివి రామకుమార్, టిపిఒ హేమంత్‌కుమార్, అధ్యాపకులు, అధ్యాపకేతర బందం, తోటి విద్యార్థులు అభినందించారు.

విజేతలకు బహుమతులు

బహుమతులు అందజేస్తున్న నాగేశ్వరరావు

ప్రజాశక్తి- మునగపాక రూరల్: మండలంలోని వాడ్రాపల్లిలో సంక్రాంతి తీర్థాన్ని పురస్కరించుకుని స్లో సైక్లింగ్, ముగ్గుల పోటీల్లో విజేతలకు ఎలమంచిలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు బహుమతులను అందజేశారు. అంతకుముందు ఎన్‌టిఆర్ వర్ధంతిని తెలుగు రైతు జిల్లా కార్యదర్శి మళ్ల వరహానర్సింహరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.టిడిపి బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీమరశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ దొడ్డి శ్రీనివాసరావు, తెలుగు రైతు రాష్ట్ర నాయకులు దాడి ముసలినాయుడు, అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ తెలుగు యువత అధికార ప్రతినిధి మళ్ల రాజేష్, పార్టీ నేతలు మళ్ల శేషుబాబు, కోయిలాడ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి -మునగపాక రూరల్: మండలంలోని మూలపేటలో సీతారాముల తీర్థాన్ని పురస్కరించుకొని గురువారం సర్పంచ్ భీశెట్టి గంగ అప్పలనాయుడు, పాలకవర్గం సొంత నిధులతో పేదలు, వద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ బొడ్డేడ జ్యోత్స్నఆదికుమార్, స్థానిక పాల కేంద్రం అధ్యక్షులు కాండ్రేగుల నాగేశ్వరరావు, స్కూల్ కమిటీ చైర్మన్ ఆడారి మోహనరావు, గ్రామ పెద్దలు భీశెట్టి పైడికొండ, ఆడారి కాశీరావు, బొడ్డేడ రవికుమార్, ఆడారి ఉదయ్‌కుమార్, ముల్లేటి పరమేశ్వరరావు పాల్గొన్నారు.

అన్ని పంచాయతీల్లో ఉపాధి పనులు

ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బందికి డ్వామా పీడీ సందీప్ ఆదేశం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అన్ని పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ఉపాధి హామీ పనులను వెంటనే ప్రారంభించాలని డ్వామా పీడీ ఇ.సందీప్ ఆదేశించారు. గురువారం మేజర్ పంచాయతీ సబ్బవరం శివారు ఆదిరెడ్డిపాలెంలో ఉపాధి హామీ పథకం కింద పంటపొలాలకు రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఆదిరెడ్డిపాలెం గ్రామం నుంచి ఆదిరెడ్డి రమణ పొలం వరకు రూ.4.80 లక్షలతో 600 మీటర్లు రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మండలంలో ప్రస్తుతం 1100 కూలీలు మాత్రమే ఉపాధి పనులకు వస్తున్నారని, ప్రతిరోజూ 4,800మంది కూలీలతో పనిచేయించాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. కూలీలకు సగటున రోజు వేతనం రూ.257లకు తక్కువ కాకుండా వచ్చేలా చూడాలన్నారు. కూలీలతోపాటు సిబ్బంది కూడా ఉదయం ఏడు గంటలకు పని ప్రదేశంలో ఉండి, టాస్క్ ప్రకారం పని చేయించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎపిఒ శ్రీనివాస్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పరమేష్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న పీడీ సందీప్

కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షకు ఏర్పాట్లు

చోడవరంలో ఐదు కేంద్రాల్లో 1810 మంది హాజరు

ప్రజాశక్తి- చోడవరం : పోలీస్ కానిస్టేబుల్ నియామక ప్రిలిమినరీ పరీక్షలు ఆదివారం చోడవరంలో ఐదు కేంద్రాల్లో జరుగుతాయని స్థానిక సిఐ బి శ్రీనివాసరావు తెలిపారు. డిగ్రీ కాలేజీలో రెండు సెంటర్లు, సాయిప్రకాష్, షిరిడి సాయి, విద్యార్థి కాలేజీల్లో ఒక్కో కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆయా కేంద్రాల్లో 1810మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు.

సిఐ శ్రీనివాసరావు

ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందని, అభ్యర్థులంతా విధిగా ఒక గంట ముందుగా అంటే తొమ్మిది గంటలకే పరీక్ష కేంద్రం వద్దకు చేరుకోవాలని సూచించారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉండదని గుర్తించాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అభ్యర్థులు తగు జాగ్రత్తలతో రావాలని సూచించారు.

సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌ఛార్జిగా రమణ


రమణను అభినందిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి

ప్రజాశక్తి- దేవరాపల్లి :మండలంలోని సచివాలయాల కన్వీనర్ల మండల ఇన్‌ఛార్జిగా కె.వి.రమణ నియమితులయ్యారు. మండలంలోని 20 సచివాలయాలకు, 60 మంది కన్వీనర్లను ఇటీవల నియమించారు. వారికి మండల ఇన్‌ఛార్జిగా రమణను నియమించారు. ఈ సందర్భంగా కె.వి.రమణ మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. తనకు బాధ్యతలు అప్పగించిన ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడుకు పుష్పగుచ్ఛం అందించి, కృతజ్ఞతలు తెలిపారు.

డైరీ, కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర అర్థ గణాంక, ప్రణాళిక శాఖ సబార్డినేట్ అసోసియేషన్ 2023 డైరీ, కేలండర్లను కలెక్టరేట్‌లోని అర్థగణాంక ప్రణాళిక విభాగం కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. జిల్లా అర్థగణాంక, ప్రణాళిక విభాగం అధికారి జి రామారావు వీటిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సబార్డినేట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జి వైకుంఠరావు, డిప్యూటీ గణాంక అధికారి జి రాజేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కేలండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న రామారావు

మెనూ సక్రమంగా అమలు చేయాలి

ప్రజాశక్తి- కశింకోట : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారం సక్రమంగా అమలు చేయాలని ఎంపిడిఒ కొంకి అప్పారావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హెచ్ఎంలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, 1తాళ్లపాలెం హైస్కూల్‌లో ప్రహరీ ఎత్తు పెంచాలని, తాళ్లపాలెం గురుకుల పాఠశాలలో మురుగు నీటి సమస్య పరిష్కరించాలని, తేగాడ కస్తూర్బా విద్యాలయంలో బోరు పనిచేయడం లేదని వివరించారు. కార్యక్రమంలో ఎంఇఒ చిట్టిబాబు పాల్గొన్నారు.

హెచ్ఎంతో మాట్లాడుతున్న ఎంపిడిఒ అప్పారావు

22న విశాఖలో సదస్సు

ప్రజాశక్తి- దేవరాపల్లి : 'భారత రాజ్యాంగం ప్రజా హక్కులు-పాలకుల బాధ్యతలు' అనే అంశంపై ఈనెల 22న ఆదివారం ఉదయం 9.30గంటలకు విశాఖ పౌరగ్రంథాలయంలో నిర్వహించనున్న మహాసదస్సును జయప్రదం చేయాలని భీమ్‌సేన వెల్ఫేర్ అసోసియేషన్ విశాఖ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్ఆర్ వేమన కోరారు.ఈ సదస్సులో ఎస్‌సి,ఎస్‌టి వేధింపుల నిరోధక చట్టం,1989 అమలుపై వివరిస్తారన్నారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని కలిగొట్ల గ్రామంలో పైడితల్లమ్మ, అలాగే కాశీపురం పరిదేశిమాంబ తీర్థం సందర్భంగా గురువారం ఆయా అమ్మవార్లను మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తీర్థం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, మాజీ ఎంపిటిసి మలిరెడ్డి రాజానాయుడు, టిడిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొట్టారు.. కేసు పెట్టారు...

పోలీసుల చర్యలపై యాదవ సంఘం నిరసన

పోలీస్ స్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న యాదవ నాయకులు

ట1ప్రజాశక్తి- చోడవరం : వెంకన్నపాలెం గ్రామానికి చెందిన కరక సన్నీ అనే యువకుడిని చోడవరం పోలీసులు అకారణంగా కొట్టి కేసు నమోదు చేశారని యాదవ సంఘం ఆధ్వర్యంలో గురువారం స్టేషన్ ముందు ఆందోళన చేపట్టారు. ఇటువంటి చర్యలు మున్ముందు జరిగితే ఊరుకునేది లేదని పోలీసులను సంఘం సభ్యులు హెచ్చరించి, ఆందోళనను విరమించారు.కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు గోకివాడ కోటేశ్వరరావు, దేవర అప్పారావు, శ్రీనివాసరావు, బి నరసింహమూర్తి, రాజబాబు, పళ్ల అర్జున యాదవ్ పాల్గొన్నారు.

వైసిపిలో 35 కుటుంబాల చేరిక

కండువాలు వేసి స్వాగతిస్తున్న ఉపముఖ్యమంత్రి బూడి

ప్రజాశక్తి- దేవరాపల్లి : ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సమక్షంలో మండలంలోని ఎల్.పొన్నవోలు గ్రామానికి చెందిన 35 కుటుంబాల టిడిపి యువత వైసిపిలో చేరారు. వీరికి మండలంలోని తారువ క్యాంప్ కార్యాలయంలో కండువాలు వేసి, పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వైసిపి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సిఎం జగన్ ఆదర్శాలు నచ్చి తాము పార్టీలో చేరుతున్నట్లు వెల్లడించారు.

రక్తహీనతపై ప్రజల్లో అవగాహన

ప్రజాశక్తి - పరవాడ: మహిళలు, పిల్లల్లో రక్తహీనతను అధిగమించేందుకు చేపట్టాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని ఎంపిడిఒ హేమసుందరరావు సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులకు స్వాబియాన్ యాన్ కార్యక్రమంపై భాగంగా పంచాయతీ కార్యదర్శులు, ఎఎన్ఎంలు, మహిళా పోలీసులు, ఆశా కార్యకర్తలు, వైద్యఆరోగ్యశాఖ, ఐసిడిఎస్ సిబ్బందికి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సిడిపిఒ లలిత కుమారి మాట్లాడుతూ బాలబాలికల్లో రక్తహీనత, పౌష్టికాహారం ఆవశ్యకత, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై వివరించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి పి పద్మజ ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్ద పీట

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు

ప్రజాశక్తి-చీడికాడ:ప్రజా సంక్షేమానికి వైసిపి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. మండలంలో ఖండివరం నుండి వీరభద్ర పేట వరకు నిర్మించిన తారు రోడ్డును ఉప ముఖ్యమంత్రి బూడి గురువారం ప్రారంభించారు. మండలంలో వీరభద్రపేట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా ఉప ముఖ్యమంత్రి అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ ప్రభుత్వం చేయని పనులు రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం చేస్తుందన్నారు. ప్రతిపక్షాలన్నీ ఏకమైనా రాష్ట్రంలో మళ్లీ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కురచా జయమ్మ నారాయణమూర్తి, జడ్పిటిసి లాలం శారద వరలక్ష్మి జానకి రామ్, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఎర్ర అప్పారావు, ఎంపీడీవో జయ ప్రకాష్ రావు, తహసిల్దార్ రాణి, వైసిపి మండల కన్వీనర్ గొల్లవిల్లి రాజుబాబు, యూత్ కన్వీనర్ స్వామి నాయుడు, వైసిపి నాయకులు శీరం రెడ్డి సూర్యనారాయణ, సుంకర వెంకట్రావు, కొండబాబు, చైతన్య పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న బూడి

మెడికల్ క్యాంపును పరిశీలిస్తున్న అధికారులు

చినతీనార్లలో అధికారుల పర్యటన

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని చినతీనార్ల గ్రామంలో గురువారం అధికారులు పర్యటించారు. మూడు రోజుల క్రితం గ్రామంలో కొంతమంది వాంతులు, విరోచనాల బారిన పడ్డారు. గొడిచెర్ల పిహెచ్‌సి వైద్యాధికారి కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డిఎల్‌పిఒ ఎస్ఎస్ఎన్ మూర్తి, ఎంపీడీవో సీతారామరాజు, ఈఓపి ఆర్ డి.వెంకటనారాయణ, ఎస్ఐ శిరీష, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ నాగభూషణం తదితర అధికారుల బృందం గ్రామంలో పర్యటించి మెడికల్ క్యాంపును సందర్శించారు. వాంతులు, విరోచనాలు ఎలా ప్రబలాయని ఆరా తీశారు. గ్రామంలో పారిశుద్ధ్యం పనులను పరిశీలించారు. వ్యాధి అదుపులోకి వచ్చే వరకు మెడికల్ క్యాంపు నిర్వహించాలని వైద్యాధికారికి సూచించారు.

అధికారుల గైర్హాజరుపై సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి - రావికమతం:పలు శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గృహ నిర్మాణ శాఖ ఏఈ రామచంద్రరావు పని తీరు పట్ల వైస్ ఎంపీపీ దంట్ల వెంకటరమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఎంపీపీ పైలరాజు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రోడ్లు భవనాలు, స్త్రీ శిశు సంక్షేమం, రాష్ట్ర రోడ్డు రవాణా , సాంఘిక సంక్షేమం, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్, పరిశ్రమలు, ఉద్యానవనం, తూనికలు కొలతలు, హార్టికల్చర్ సెరికల్చర్ శాఖలకు సంబంధించిన మండల స్థాయి అధికారులు డుమ్మా కొట్టడంపై సభ్యులు పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా శాఖలకు సంబంధించిన సమాచారం ఎవరు ఇస్తారని పలువురు సభ్యులు ప్రశ్నించారు. దీనికి ఎంపీడీవో వెంకన్న బాబు సమాధానం ఇస్తూ ఎవరైతే ఈ సమావేశానికి హాజరు కాలేదో వారి వివరాలను సంబంధిత శాఖల అధికారులకు, జిల్లా కలెక్టర్కు అందజేస్తామన్నారు. గృహ నిర్మాణ శాఖ ఏఈ కొత్తగా ఎవరికి ఇల్లులు మంజూరు చేయ లేదని, కట్టిన ఇల్లులకు బిల్లులు కూడా ఇవ్వలేదన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లను బిల్లులు పెట్టవద్దని హుకుం జారీ చేస్తున్నారని తెలిపారు. దీంతో మండలంలో గృహ నిర్మాణ శాఖ పనులు నత్తనడకన సాగుతున్నాయని, దీంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని సభ్యులు పలువురు దుయ్యబట్టారు. సివిల్ సప్లై సరుకుల వివరాలను ముందుగా సర్పంచ్లు, ఎంపీటీసీలకు తెలియపరచాలని సభ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ సర్వే యంత్రాంగం సర్వే పూర్తి అయిన తర్వాత గ్రామసభ నిర్వహించ లేదని కవగుంట సర్పంచ్ సూర్య కుమారి వరహాలు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. డిఫాం భూముల సర్వే నామమాత్రంగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దంట్ల వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, దేవా తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన అధికారులు ,నాయకులు

పిల్లలను విడుదల చేస్తున్న ప్రజాప్రతినిధులు

'తాండవ'లో చేప పిల్లల విడుదల

ప్రజాశక్తి-గొలుగొండ:సాలికమల్లవరం సమీపంలో గల తాండవ జలాశయంలో 4 లక్షల 20 వేల చేప పిల్లలను జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపిపి గజ్జలపు మణికుమారి గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మత్స్యశాఖ అధికారి ఆశాజ్యోతి మాట్లాడుతూ, గతంలో జలాశయంలో 5.20లక్షల చేప పిల్లలను విడుదల చేయడం జరిగిందని, ఈసారి మరో రూ.4.20లక్షల పిల్లలను విడుదల చేశామన్నారు. అనంతరం నలుగురు మత్స్యకారులకు సబ్సిడీపై మోటార్ సైకిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, వైస్ ఎంపిపి జక్కు నాగమణి, వైసిపి యువజన విభాగం అధ్యక్షులు మాకిరెడ్డి రామకృష్ణనాయుడు, తాండవ స్వదేశీ మత్స్యకార సంఘం చైర్మన్ నక్కా రమణ, సాలికమల్లవరం సర్పంచ్ పెదిరెడ్ల నూకరత్నం, వైసిపి మండల ప్రధాన కార్యదర్శి పత్తి రమణ, పంచాయతీ కార్యదర్శి స్వామి, వైసిపి ప్రధాన కార్యదర్శి అప్పలస్వామినాయుడు, మత్స్యకారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ

23 నుంచి గ్రామసభలు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం స్వాభిమాన్ కార్యక్రమం పై మండల స్థాయి అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. అన్ని గ్రామాల్లోనూ గ్రామసభలు ఏర్పాటు చేసి ఈనెల 23 నుండి వచ్చేనెల 8వ తేదీ వరకు గ్రామ ప్రజలకు, పాఠశాలలో విద్యార్థులకు కార్యక్రమం పై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్పిఒ మూర్తి, ఎంపీడీవో సీతారామరాజు, తహసీల్దార్ సుబ్రహ్మణ్యం శాస్త్రి, ఎంఈఓ డివిడి ప్రసాద్, ఈఓపి ఆర్‌డి వెంకటనారాయణ, వైద్యశాఖ అధికారులు, ,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనే ధ్యేయం

ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్:నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే ముఖ్యమంత్రి జగన్ ధ్యేయమని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. గురువారం నర్సీపట్నం డిగ్రీ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన అభ్యర్థులకు జిల్లా నైపుణ్యా భివృద్ధి సంస్థ అధికారి చాముండేశ్వరరావు ఆధ్వర్యంలో నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నిరుద్యోగ యువతకు మెరుగైన శిక్షణ అందించి ఉపాధి కల్పించే విధంగా ముఖ్యమంత్రి రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో శిక్షణ కేంద్రాలను నెల కొల్పారన్నారు. స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో ఇక్కడ శిక్షణ పొందిన 23 మంది నిరుద్యో గ యువతకు వివిధ కంపెనీల్లో ఉద్యోగవకాశాలు పొందారన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి చాముండేశరరావు మాట్లాడుతూ, మొదటి దశలో 30 మందితో శిక్షణ కార్యక్రమం పూర్తయిందన్నారు. దీనిలో 23 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించడం జరిగిందన్నారు. మిగిలిన వారికి వారం రోజుల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గుడబండి ఆదిలక్ష్మీ, వైస్ చైర్మన్లు గొలుసు నరసింహమూర్తి, తమరాన అప్పలనాయుడు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు, వైసిపి పట్టణ అధ్యక్షులు ఏకా శివ, స్కిల్ డెవలప్మెంట్ నర్సీపట్నం కోఆర్డినేటర్ శ్రీనివాస్, వైసిపి నాయకులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నియామక పత్రాలు ఇస్తున్న ఎమ్మెల్యే

నీరజ్‌కు నగదు ఇస్తున్న స్నేహాంజలి సంస్థ ప్రతినిధులు

నీరజ్‌కు రూ.12 వేలు సాయం

ప్రజాశక్తి-కొత్తకోట:బోన్ మ్యారో వ్యాధితో బాధ పడుతున్న కొత్తకోటకు చెందిన పదవ తరగతి విద్యార్థి గట్రెడ్డి నీరజ్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం స్నేహాంజలి ఫర్ ప్యూర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రూ.12 వేల నగదు సాయం అందజేశారు. గురువారం కొత్తకోటలో విద్యార్థి నీరజ్ ఇంటి వద్ద సంస్థ ప్రతినిధులు బోగేష్, ఉమా, అశోక్, కన్నయ్యదొర, యేసు తదితరులు నగదును అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు బోగేష్ మాట్లాడుతూ, పేదలకు సాయం అందించాలన్న సంకల్పంతో ఆర్గనై జేషన్ ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థి నీరజ్‌కు దాతల సాయంతో పాటు ప్రభుత్వం వైద్య సేవలు అందించేందుకు ముందుకు రావడం ఆనందదాయకమని పేర్కొన్నారు.

పరీక్షలు చేస్తున్న వైద్యులు

సిహెచ్.నాగాపురంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-గొలుగొండ:సిహెచ్.నాగాపురంలో గురువారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. బిపి, సుగర్‌తో పాటు ఇతర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఆసుపత్రికి వెళ్లే పని లేకుండా గ్రామంలోనే వైద్య శిబిరం ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రఘు రామచంద్రరావు, డాక్టర్ ఎన్.హరిప్రవీణ్, ఏఎన్ఎం సత్యవతి, ఆశ వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్ని తరగతుల ప్రజలకూ అన్యాయం

ప్రజాశక్తి-నక్కపల్లి:ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను అన్యాయం చేసిందని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత విమర్శించారు. మండలంలోని బంగారమ్మపేట గ్రామంలో గురువారం ఇదేం ఖర్మ కార్యక్రమంలో గ్రామంలో పర్యటించారు. వైసీపీ పాలనను ఎండగట్టారు. సంక్షేమ పథకాల పై కోతలు విధిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, పార్టీ నాయకులు కురుందాసు నూకరాజు, లాలం కాశీనాయుడు, కొప్పిశెట్టి బుజ్జి, గింజాల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అనిత

ప్రభాస్ వీరాభిమాని విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-గొలుగొండ:నర్సీపట్నం మున్సిపాలిటీ 16వ వార్డు కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి, శ్రీనివాస్ దంపతుల కుమారుడు రంజిత్ కుమార్ ఏడాది క్రితం అనారోగ్యంతో మరణించాడు. రంజిత్ ప్రభాస్ వీరాభిమాని. తన అభిమాని కేన్సర్‌తో బాధ పడుతున్నాడనే విషయం తెలుసుకొని స్వయంగా ప్రభాస్ హైదరాబాద్ రప్పించుకొని రంజిత్‌కుమార్‌తో ఒక రోజంతా గడిపారు. ఆ తర్వాత కొద్ది రోజులకే రంజిత్‌కుమార్ మృతి చెందారు. కుమారుడు జ్ఞాపకార్థం తల్లిదండ్రులు రంజిత్‌కుమార్ విగ్రహాన్ని కరక గ్రామంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గుడబండి ఆదిలక్ష్మీ, గొలుగొండ ఎంపిపి గజ్జలపు మణికుమారి, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, నర్సీపట్నం మున్సిపాలిటీ వైస్ చైర్మన్లు గొలుసు నరసింహమూర్తి, తమరాన అప్పలనాయుడు పాల్గొన్నారు.

సుందర నగరంగా విశాఖ

టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ: విశాఖ నగరాన్ని సుందర విశాఖగా తీర్చి దిద్దాలని తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం కైలాసగిరి కొండపై జిల్లా కలెక్టర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖకు మణిహారమైన కైలాసగిరిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా అత్యంత సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఆర్‌కె.బీచ్ నుండి రుషికొండ వరకు సుమారు 12 కిలోమీటర్ల తీర ప్రాంతాన్ని పర్యాటకులు ఆకర్షించే విధంగా తీర్చి దిద్దుతున్నామని చెప్పారు. పర్యాటకులకు భద్రత కల్పించడంలో భాగంగా సుమారు 38 మంది గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశామన్నారు. ఆర్‌కె.బీచ్ నుండి రుషికొండ వరకు సముద్రపు ఒడ్డున విద్యుద్దీకరణ చేస్తున్నట్లు వెల్లడించారు. పర్యాటకులకు వసతి సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్లాస్టిక్ నిషేధించడంలో భాగంగా ఈ నెల 26 నుండి నగరంలో ప్లాస్టిక్‌తో కవర్లు, బేనర్లు తదితర వస్తువులు తయారు చేయడం, వినియోగించడం చేయరాదని సూచించారు. మార్చి 3, 4 తేదీలలో పారిశ్రామిక వేత్తలతో జరగబోయే గ్లోబల్ సమ్మిట్, మార్చి 28, 29 తేదీలలో నిర్వహించబోయే జి20 సదస్సుకు వివిధ దేశాల నుండి హాజరవుతున్న ఆహూతులను ఆకర్షించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు, వియంఆర్‌డిఎ చైర్‌పర్సన్ అక్కరమాని విజయ నిర్మల, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, డిఎఫ్ఓ శాంతి స్వరూప్, అధికారులు పాల్గొన్నారు.

కైలాసగిరిలో పర్యటిస్తున్న వైవి సుబ్బారెడ్డి

భూముల రీ సర్వే ను ప్రారంభిస్తున్న డిటి

సమగ్ర సర్వేతో భూ వివాదాలు పరిష్కారం

ప్రజాశక్తి నర్సీపట్నం రూరల్: శాశ్వత భూ హక్కు పత్రాలు జారీ చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని, ఇందు నిమిత్తం భూముల రీ సర్వేను చేపడుతుందని నర్సీపట్నం మండల డిప్యూటీ తహసిల్దార్ బి.సత్యనారాయణ తెలిపారు. మండలంలోని గబ్బాడ రెవెన్యూ పరిధిలోని రెట్టవానిపాలెంలో వైయస్సార్ జగనన్న భూ హక్కు -భూ రక్ష రీ సర్వేను ప్రారంభించారు. అనంతరం రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ మాట్లాడుతూ, ఫిబ్రవరి నెలకరికి 2 వేల గ్రామాల్లో, మే నెలాఖరు నాటికి 4 వేల గ్రామాల్లో రీ సర్వే పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయిం చిందన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ, గ్రామకంఠాల సర్వే, డూప్లికేట్ రికార్డులు, భూ వివాధాల పరిష్కారమే లక్ష్యంగా సమగ్ర సర్వే చేస్తుందన్నారు. రీ సర్వే పూర్తయిన భూ యజమానులకు త్వరలోనే భూ హక్కు పత్రాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంకటలక్ష్మి, విఆర్ఓ సింహాచలం, సర్వే బందం బి. క్రాంతి లతోపాటు ఎంపిటిసి సభ్యు రాలు మాకిరెడ్డి తాతమ్మ ,గబ్బాడ సచివాలయ కన్వీనర్లు మాకిరెడ్డి సన్యాసినాయుడు ,మాకిరెడ్డి వెంకట నాగలక్ష్మి ,మాజీ సర్పంచ్ మాకిరెడ్డి పోతురాజు నాయుడు, సన్యాసినాయుడు వెంకీ నాయుడు వైయస్సార్ సేవాదళ్ ప్రతినిధి నానాజీ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ ప్రకాష్ విద్యార్థి చక్రి ప్రతిభ

ప్రజాశక్తి-పాయకరావుపేట: విజయవాడ జిల్లా గన్నవరం జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో జరిగిన 44వ రాష్ట్ర స్థాయి జూనియర్ (బాలుర) హ్యాండ్ బాల్ పోటీలలో శ్రీ ప్రకాష్ విద్యార్థి .దీపక్ చక్రి(10 వ తరగతి) అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. ఈ నెల 26నుండి 31వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రం తిరుచురాపల్లిలో జరిగే 44వ జూనియర్ (బాలుర) జాతీయ స్థాయి పోటీలలో పాల్గొననున్నాడని ప్రధానోపాధ్యాయులు డివి. శ్రీనివాస్ తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపల్ ఎంవివిఎస్ మూర్తి, కోచ్‌లు బాలరాజు, సురేష్ తదితరులు అభినందించారు.

15 వరకూ ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి-గొలుగొండ: ఫిబ్రవరి 15వ తేదీ లోపు రైతు భరోసా కేంద్రాల్లో రైతుల ధాన్యం కొనుగోలు చేస్తామని గొలుగొండ మండల వ్యవసాయాధికారి సుధారాణి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సినీ నటుడు రవి శంకర్ సందడి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : సినీ నటుడు రవి శంకర్ నర్సీపట్నంలో సందడి చేశారు. ఓ సినిమా షూటింగ్లో పాల్గొనేందుకు ఆయన నర్సీపట్నం వచ్చారు.స్థానిక రాజశేఖర్ ఆసుపత్రిలో డాక్టర్ రాజశేఖర్ కుటుంబ సభ్యులతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు 200 సినిమాల్లో నటించానని తెలిపారు. తాను నటించిన రెండు సినిమాలు త్వరలో విడుదల కానున్నట్లు పేర్కొన్నారు.

ఆసుపత్రి సిబ్బందితో రవిశంకర్

మంత్రి కనుసన్నల్లోనే విస్సన్నపేటలో భూ దోపిడీ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ)

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కనుసన్నల్లోనే అనకాపల్లి జిల్లా కశింకోట మండలం బయ్యవరం శివారు విస్సన్నపేటలో 600 ఎకరాలకు పైగా భూ దోపిడీ జరిగిందని జనసేన పార్టీ అనకాపల్లి నియోజవర్గం అధికార ప్రతినిధి దూలం గోపి ఆరోపించారు. అనకాపల్లికి చెందిన జనసేన నాయకులతో కలిసి గురువారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విస్సన్నపేటలోని సర్వే నెంబర్ 195/2లో 609.24 ఎకరాల భూములను కబ్జా చేశారని, ఇందులో అసలు సూత్రధారులుగా అమర్‌నాథ్‌తో పాటు మునగపాక మండలానికి చెందిన బొడ్డేడ ప్రసాద్ ఉన్నారని తెలిపారు. రికార్డులు తారుమారు చేసి రైతులకు మంత్రి అన్యాయం చేశారన్నారు. వక్ఫ్ భూములను కూడా ఆక్రమించేందుకు కుట్ర చేస్తున్నారని చెప్పారు. 2.5 ఎకరాల గెడ్డను కప్పేసి, 100 అడుగుల వెడల్పుతో అప్రోచ్ రోడ్డును నిర్మిస్తున్నారని తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంపై జాయింట్ కలెక్టర్‌తోగాని, రిటైర్డ్ జడ్జితో గాని విచారణ జరిపించాలని, అవసరమైతే సిబిఐ దర్యాప్తు జరిపి నిజాలు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ అనకాపల్లి ప్రాంత నాయకులు శ్రీరామదాసు గోవిందరావు, తాడి రామకృష్ణ, మళ్ల శ్రీను, ఆర్.సత్యం దొర తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల పరిషత్ సమావేశ మందిరంలో రక్తహీనతపై అంగన్వాడి, వైద్య సిబ్బంది తో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న వైద్య సదుపాయాలను రక్త హీనత లోపం ఉన్న వారికి తెలియజేయాలని సూచించారు. అంగన్వాడి సూపర్వైజర్ శ్రీసత్య మాట్లాడుతూ చిన్నారులకు పోషక విలువలతో కూడిన ఆహారం అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖా అధికారి అప్పారావు, ఇఒపిఆర్‌డి ప్రేమ్ కుమార్, పలువురు కార్యదర్శులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ

ఎల్‌ఐసిని బలోపేతం చేయాలి

నిరసన చేపుడుతున్న ఎల్ఐసి ఉద్యోగులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : ప్రభుత్వ రంగాన్ని కాపాడి, ఎల్ఐసిని బలోపేతం చేయాలని స్థానిక ఎల్ఐసి ఉద్యోగులు కోరారు. స్థానిక ఎల్ఐసి ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఎల్ఐసి కార్యాలయం ముందు నినాదాలు చేశారు. ఎల్ఐసి ఉద్యోగుల సంఘం ఉద్యోగులు మాట్లాడుతూ, పాలసీదారులు కష్టపడి పొదుపు చేసుకున్న సొమ్మును దుర్వినియోగం అవుతుందనే ఉద్దేశ్యంతోనే ఎల్ఐసి ఆఫ్ ఇండియా ను జాతీయం చేశారన్నారు.ప్రజల సొమ్ము ప్రజలకు అనే నినాదంతోనే నాడు కొన్ని సంవత్సరాలు క్రితమే జీవిత భీమా వ్యాపార సంస్థలు జాతీయకరణ చేయాలని డిమాండ్ చేసేవారని అన్నారు. ఎల్ఐసి స్థిరంగా ఉంటూ తమ లక్ష్యాలను అద్భుతంగా సాధిస్తుందని, సామాజిక బాధ్యతలు నెరవేర్చడంలో ప్రముఖ పాత్ర వహిస్తుందని తెలిపారు. 1955లో ఐదు కోట్లతో ప్రారంభమైన ఎల్ఐసి ప్రస్తుతం 42.37 కోట్ల రూపాయలు ఆస్తులు కలిగివుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎల్ఐసి విస్తరించి ఉందని 30 కోట్లకు పైగా ఎల్ఐసి పాలసీదారులు ఉన్నారని, 2020 21 ఆర్థిక సంవత్సరంలో భారీ ఎత్తున భీమా సెటిల్మెంట్లు చేసి రికార్డు సాధించిందని గుర్తు చేశారు. అటువంటి ఈ సంస్థలో ప్రభుత్వం వాటా మూడు పాయింట్ ఐదు శాతం ఉపసంహరణ చేసుకుందని, ఇది ఎల్ఐసి మౌలిక లక్ష్యాలకు విఘాతం కలిగించే విధంగా ఉందన్నారు. దీన్ని భీమా ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఐఆర్‌డిఏఐ అనుసరిస్తున్న విధానాలతో దేశంలో బీమా సంస్థలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటాయని, ప్రైవేటు ఇన్సూరెన్స్ సంస్థలకు లాభం చేకూర్చే విధంగా వ్యవహరిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు విసిహెచ్ నూకరాజు, కార్యదర్శి కేకేబీ పడాల్, చంటి, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండలంలోని ఎం జగన్నాధపురం గ్రామంలో గురువారం జాతీయ ఉపాధి హామీ పథకం పనులను వైసిపి నేతలు భీముని వెంకటేశ్వరరావు, రావి శోభన్‌బాబు తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి పనులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హైస్కూల్ చైర్మన్ గొర్లి శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ సేనాపతి వెంకటేష్, విఆర్‌పి సురంగుల కాశీ, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

ఊరేగింపునకు తరలి వచ్చిన భక్తులు

గౌరీపరమేశ్వరుల ఊరేగింపు

ప్రజాశక్తి-రోలుగుంట: కుసర్లపూడిలో రాములవారి తీర్ధంను పురస్కరించుకొని గురువారం శ్రీగౌరి పరమేశ్వర్లు ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. సారెలతో గ్రామంలో ప్రజలందరతో కలిసి ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మడ్డు అప్పలనాయుడు, వైస్ ఎంపిపి కొల్లు సన్యాసినాయుడు, పార్టీ సీనియర్ నాయకులు సబ్బవరపు పెద్దినాయుడు, స్కూల్ చైర్మన్ గొల్లు రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాకేష్‌రెడ్డి

కాంగ్రెస్ నేతల సమావేశం

ప్రజాశక్తి-పాయకరావుపేట: స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న జనతా కళ్యాణ మండపంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ విజయకుమార్ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు.ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు, ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జి పోచారెడ్డి రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ, నియోజవకర్గ స్థాయిలో పాయకరావుపేట మండలానికి చెందిన జగతా శ్రీనివాస్, తాళ్లూరి విజయ్‌కుమార్, వెంకటరమణ, మోర్త సింహాచలం, నక్కపల్లి మండలానికి చెందిన ఎన్ఎస్‌వి సత్యనారాయణ, కోటవురట్ల మండలానికి చెందిన నూకరాజులను కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులుగా నియమిస్తున్నట్లు తెలిపారు. కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో మాత్రమే పార్టీ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రాహల్‌గాంధీ చేపట్టిన పాదయాత్ర ఈనెల 30తో ముగుస్తుందని, దీనికి సంఘీభావంగా ఈనెల 26 నుంచి మార్చి 26వరకు గ్రామ స్థాయిలో పాదయాత్రలు నిర్వహించాలని సూచించారు. పాదయాత్రలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.